



ఉండ్రాజవరంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



ఉరుకులు.. పరుగులు : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి.. నీట మునిగిన డ్రెడ్జింగ్ పడవ



నిండు కుండలా : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉధృతంగా ఉన్న గోదావరి

వరద గోదారి 7

వరద పోటు

రెండో ప్రమాద హెచ్చరిక దిశగా గోదారి

- ఒక్కసారిగా పెరిగిన వరద
- సముద్రంలా అఖండ గోదావరి
- ధవళేశ్వరం వద్ద ప్రవాహ ఉధృతి
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- దిగువకు 12.68 లక్షల క్యూసెక్కులు
- 13.60 అడుగులకు నీటిమట్టం
- నీట మునుగుతున్న లంకలు
- ఘాట్లలో కలెక్టర్ నిషేధాజ్ఞలు
- భద్రాచలం వద్ద తగ్గుముఖం

రాజమహేంద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : గోదావరి ఉప్పొంగుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరి మహోగ్రరూపం దాల్చింది. ఉపనదులు పొంగి ప్రవహించడంతో అఖండ గౌతమి గోదావరి ఉగ్రరూపం దాల్చి పోటెత్తుతోంది. గత కొన్నిరోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఉపనదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఉప నదులైన శబరి, ప్రాణహిత, ఇంద్రావతి, మంజీర, కిన్నెరసాని, మానేరు, ప్రవర, పర్ణ నదుల నుంచి భారీగా వరద వచ్చి గోదావరిలో చేరుతుంది. భద్రాచలం వద్ద ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. మూడో ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి పరవళ్లు తొక్కుతోంది. భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 12 గంటలకు 50.40 అడుగులకు నీటిమట్టం చేరింది. అది 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతోంది. అయితే రాత్రి 12 గంటల తరువాత 50.20 అడుగులకు తగ్గింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల మధ్య అఖండ గోదావరి సముద్రంలా మారింది.లంకలన్నీ మునిగిపోతున్నాయి.పలు గ్రామాల నుంచి ప్రజలను పునరావాస కేంద్రాలకు తర లించా రు. ధవళేశ్వరం బ్యారేజి వద్ద సోమవారం ఉదయం 7 గంటలకు మొదటి ప్ర మాద హెచ్చరిక జారీ అయింది. రాత్రి 12 గంటలకు బ్యారేజి నీటిమట్టం 13.60 అడుగులుగా నమోదైంది. బ్యారేజి నుంచి 175 గేట్ల ద్వారా సముద్రంలోకి 12,68,958 క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేశారు. దీంతో కోనసీమ జిల్లాలో పలు గ్రామాలు నీట మునుగు తున్నాయి.ఈ రాత్రికే బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చ రిక జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబు తున్నారు. బ్యారేజి నీటిమట్టం 13.75 అడుగులకు చేరినా, సముద్రంలోకి 13 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వెళ్లినా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఈ నేప థ్యంలో తీర ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముంపు, లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని కోరుతున్నారు. వరద గోదావరిని చూడడానికి ప్రజలు అధికసంఖ్యలో క్షేత్రానికి చేరుకుంటున్నారు.కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు ఆధ్వ ర్యంలో గోష్పదక్షేత్రంకు వెళ్లే రహదారుల వద్ద బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వరద పరిస్థితిని పోలీస్, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.ఇదిలా ఉండగా గోదావరి లంక ల్లోని అనేక గ్రామాలు నీట మునిగాయి. గోదావరి ఘాట్ల వద్ద నిషేధాజ్ఞలు కొనసాగిస్తున్నారు. కొవ్వూరు ఘాట్లలో ఆదివారం రాత్రి నుంచి 24 గంటలూ పర్యవేక్షించేలా డ్యూటీలు వేశారు.కొవ్వూరు సీఐ జగదీశ్వరరావు ఘాట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.రాజ మహేంద్రవరం ఘాట్లలో కలెక్టర్ పి.ప్రశాంతి,ఎస్పీ నరసింహ కిశోర్ పర్యటించిన తర్వాత ఎవరూ ఘాట్లలోకి వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదావరిలో పడ వలు తిరగకుండా నిషేధించారు..సీతానగరం మండ లంలోని ములకల్లంక గ్రామంలో ప్రజలు ఇంకా లంకలోనే ఉన్నారు.వీళ్లను ఖాళీ చేయించడానికి అధికారులు నానా తంటాలు పడుతున్నారు. కొవ్వూరు మండలం మద్దూరు లంక, ఇతర లంకల్లో కూడా జనం ఉన్నారు. సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో వరద నీరు అధికంగా ఉండడంతో కాలువలో ఒక బాలుడు గల్లంతయ్యాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.వర్షాలకు దెబ్బతిన్న ఇల్లు కూలడంతో గోకవరానికి చెందిన మేకాని సుబ్బలక్ష్మి గాయాలపాలయ్యారు.



పునరావాస కేంద్రాలకు జనం..

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22 : గోదావరి వరదలు పెరగడంతో రాజమహేంద్రవరం పరీవా హక లంకల నుంచి సుమారు 300 మంది ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. రాజమహేంద్రవరం ఆర్‌డీవో చైత్రవర్షిణి పర్యవేక్షణలో లంకల నుంచి వరద బాధితులను తీసుకొచ్చారు. చంద్రా సత్రంలో 120 మంది, ఆలకట్ గార్డెన్స్ మునిసిపల్ కల్యాణ మండపంలో 60 మంది ఉన్నారు. కేతావా రిలంక,బ్రిడ్జిలంక ,ఎదుర్లమ్మలంకల నుంచి 130 బోట్లలో ప్రజలను సురక్షితంగా తరలించినట్టు చైత్రవర్షిణి తెలిపారు.ఆమె వెంట ఫైర్ ఆఫీసర్ కే మార్టిన్ లూథర్ కింగ్, అదనపు కమిషనర్ పిఎం.సత్యవాణి, తహశీల్దార్ రాజశేఖర్, మత్స్యశాఖ, పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో 69.4 మి.మీ వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22 : జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 69.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గోకవరం మం డలంలో 11.6 మి.మీ వర్షం కురిసింది. అత్యల్పంగా సీతానగరంలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో కోరుకొండ మండలంలో 3.0. మి.మీ, రంగంపేటలో 2.4 మి.మీ, రాజానగరంలో 4.8 మి.మీ, బిక్కవోలులో 7.6 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 1.6 మి.మీ,అనపర్తిలో 4.8 మి.మీ,తాళ్ళపూడిలో 2.4 మి.మీ, గోపాలపురంలో 1.2 మి.మీ, రాజమహేంద్రవరంలో 9.2 మి.మీ, కడియంలో 4.2 మి.మీ,కొవ్వూరులో 5.8 మి.మీ,ఉండ్రాజవరంలో 0.8 మి.మీ, నల్లజర్లలో 2.6 మి.మీ, నిడదవోలులో 2.2 మి.మీ, చాగల్లు లో 1.8 మి.మీ, పెరవలిలో 0.4 మి.మీ వర్షపాతం న మోదైంది. సగటున జిల్లాలో 3.6 శాతం వర్షం కురిసింది.

రోడ్డెక్కిన.. ఎర్రకాల్వ

నిడదవోలు, జూలై 22 : నిడదవోలు మండలం శింగవరం, తీరుగూడెం, తిమ్మరాజుపాలెం, తాళ్ళపాలెం గ్రామాల్లోన్ని పంటపొలాలు ఎర్రకాలువ ముంపులోనే ఉన్నాయి. భారీ వర్షాలకు కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం నుంచి ఎర్రకాలువ వరదను దిగువకు విడుదల చేస్తుం డడంతో నిడదవోలు మండలంలోని గ్రామాల్లో ఎర్రకాలువ వరద ఉధృతి కొనసాగుతూ ఉంది. నిడదవోలు నుంచి తీరుగూడెం వెళ్లే రహదారిపై ఎర్రకాలువ వరదనీరు పొంగి పొర్లుతుంది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు సిద్ధంకండి

టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22 : గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అధికార యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా అధికారులు , ప్రత్యేక అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టర్ సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి ఘాట్ల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. వ్యవసాయ, మౌలిక సదుపాయాల నష్టాల అంచనాలు సమర్పించాలన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం డివిజన్లలో ముంపు గ్రామాలను గుర్తించి తరలింపు చర్యలకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, మెడికల్ క్యాంప్, 24/7 శానిటేషన్ ఉండాలన్నారు. ప్రభావిత ప్రాంతాలకి మిగిలిన పంచాయతీ కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బందని డిప్యుటేషన్ చేయాలన్నారు. పంచాయతీల అధికారులు ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసి సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

కాలువలో బాలుడి గల్లంతు
మిర్తిపాడులో ఘటన 8

అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా

నేడు చల్లా శంకర్రావు ఎన్నిక

రాజమహేంద్రవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఆర్యాపురం అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ పాలకవర్గం ఛైర్మన్ ఎన్నిక మంగళవారం నాటికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం సోమవారమే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరగవలసి ఉంది. కానీ ముహూర్తం కుదరకపోవడంతో ఎన్నికను వాయిదా వేసినట్టు సమాచారం. ఛైర్మన్‌గా కూటమి అభ్యర్థి చల్లా శంకరరావు ఎన్నిక కానున్నారు. వైస్ ఛైర్మన్‌గా పోలాకి పరమేశ్వరరావు పేరు వినిపిస్తోంది. ఇదిలా ఉండగా అర్బన్ బ్యాంక్ ఛైర్మన్‌గా విజయం సాధించిన చల్లా శంకర్రావును సోమవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు,పిన్నింటి రవిశంకర్, తురకల నిర్మల, మీసాల నాగమణి తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.269 కోట్లు

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 : రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రూ.269 కోట్లు కేటాయించిట్టు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు.డిల్లీలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన పురేందేశ్వరి రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి, ఇతర రైల్వే సమస్యలపై చర్చించారు. రైల్వే సమస్యల పరిష్కారం, రైల్వేస్టేషన్ అభివృద్ధిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని పురందేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎకరాకు రూ.6 వేల పరిహారం : దుర్గేష్

పెరవలి, జూలై 22 : నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కానూరు లో సోమవారం ముంపు చేలను పరిశీలించి నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలవరకు నష్టపోయామని పేర్కొన్నారు.నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.6 వేలు చొప్పున పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఆయన వెంట నాయకులు అతికాల శ్రీను,పిప్పర రవి, వా కలపూడి వీర్రాజు, చిట్టూరి వెంకట నారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, నందిప శ్రీనివాస చక్రవర్తి పాల్గొన్నారు.



గుండేపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రతి రైతును ఆదుకుంటాం : కలెక్టర్

నల్లజర్ల, జూలై 22 : నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. నల్లజర్ల మండలం గుండేపల్లిలో సోమవారం పునరావాస కేంద్రాన్ని పరిశీలిం చి రైతులతో మాట్లాడారు. గ్రామంలో 20 ఎకరాల వరి పంట వరద నీటికి కొట్టుకుపోయిందని రైతులు తెలిపారు.ఎర్ర కాల్వ వరద ఉధృతి వల్ల దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించామని,ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎర్ర కాల్వ ఉధృతి తగ్గడంతో మంగళవారం పునరావాస కేంద్రాల నుంచి ప్రజలను వారి ఇళ్లకు పంపించి వేస్తామన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఎస్పీ కిశోర్, సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ

అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

కొవ్వూరు, జూలై 22 : గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున ఎవరూ నది లోపలికి వెళ్లరాదని జిల్లా ఎస్పీ డి.ఎన్.కిశోర్ అన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని సోమవారం సందర్శించి వరద పరిస్థితిని పరిశీలించి మాట్లాడారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.లంకల్లో ఉన్న పశువులను బయటకు తీసుకురావాలని సూచించారు. గోదావరి తగ్గే వరకు నదీ తీరప్రాంతాల్లో ప్రజలు పోలీసు, రెవెన్యూ అధికారుల సూచనలు పాటించాలన్నారు.ఎక్కడైనా గండి కొడితే తక్షణం పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ, సీఐ వి.జగదీశ్వరరావు గత గోదా వరి వరద పరిస్థితులను వివరించారు.



కాలువ కాదు.. రోడ్డే : నిడదవోలు మండలం తీరుగూడెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న ఎర్రకాల్వ వరద నీరు



నిర్మలమ్మా.. నిధులివ్వమ్మా!

ఈ పద్దులోనైనా పైసలిస్తారా..



- నేడే కేంద్ర వార్షిక బడ్జెట్
- మూడో సారి నిర్మలమ్మ పద్దు
- వెక్కిరిస్తున్న విభజన హామీలు
- రూ.300 కోట్ల పెట్టుబడుల మాటేంటి
- ఐఐపీ, ఐఐఎఫ్‌టీకి అప్పట్లో ప్రకటన
- ఇప్పటికీ పట్టాలెక్కని ఇన్‌స్టిట్యూట్స్
- సెజ్‌లో ఖాళీగా మారిన భూమి
- తాత్కాలిక భవనంలోనే ఐఐఎఫ్‌టీ
- పదేళ్లలో కేటాయింపు రూ.20కోట్లే
- కలగా పెట్రోకెమికల్ కాంప్లెక్స్
- కేంద్రంలో కీలకంగా కూటమి
- దయతలిస్తే మారనున్న దశ దిశ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు రెండు కాదు.. పదేళ్ల నుంచీ నిరీక్షణ.. విభజన హామీలు అమలుకు నోచుకుంటాయని.. జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని.. కానీ ఎప్పటికప్పుడు అదే రిక్తహస్తం.. వినిపించుకోని వినతులు.. పట్టాలెక్కని ప్రాజెక్టులు.. కంటి తుడుపుగానైనా కాణీ కూడా ఇవ్వని బడ్జెట్ పద్దులతో ప్రతిసారీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నష్టపోతూనే ఉంది.. అయినా పదేళ్ల నుంచీ ఎదురుచూపులు చూస్తూనే ఉంది. అయితే మూడోసారి వరుసగా గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వెన్నెముకగా మారిన నేపథ్యంలో ఈ పద్దులోనైనా జిల్లాకు మేలు జరుగుతుందా అనే ఆశలు అందరిలో నెలకొన్నాయి. విభజన సమయంలో ఇచ్చిన హామీలకు ఈసారైనా న్యాయం జరుగుతుందా అని అంతా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా 2014లో అప్పట్లో విభజన హామీల కింద కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లు రూ.300 కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. రూ.32వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. అయితే ఇప్పటికీ అవి వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఒక్క ఫారన్ ట్రేడ్ క్యాంపస్ మాత్రం ఏదో మొక్కుబడిగా జేఎన్టీయూకేలో తాత్కాలిక భవనంలో నడుస్తోంది. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో అయినా నిధులిచ్చి మోక్షం కల్పించాల్సిన అవసరం ఉంది.

భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ వచ్చేనా?

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం కాకినాడలో రూ.32 వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. అందులో భాగంగా 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటుచేయడానికి గెయిల్-హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడిచమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలు ఎక్కించడానికి గత టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపింది. చమురు కంపెనీల ఇంజనీర్లు వచ్చి సెజ్ భూమి నాణ్యత పరీక్షించి పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువుగా ఉందని తేల్చారు. తర్వాత పనులు ప్రారంభించేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఒత్తిడి తెచ్చారు. పైగా అప్పట్లో రాష్ట్రంలో కేంద్రానికి భాగస్వామ్యం ఉండడంతో అనుమతి పనులు చకచకా ముందుకు కదిలాయి. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధి పొందనున్నందున రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రానికి విన్నవించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కొంత మెత్తబడినట్టే కనిపించింది. కానీ ఈలోపు రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో విషయం మళ్లీ మొదటికొచ్చింది. తర్వాత పెట్రో కాంప్లెక్స్ విషయమై జగన్ సర్కారు కేంద్రాన్ని నిలదీయలేక ఐదేళ్లు పట్టించుకోలేదు. తాజాగా రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి ఫైళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు దుమ్ము దులిపించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు కదిలేలా పావులు కదపడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కేంద్రం బడ్జెట్ పద్దులో దీనికి సంబంధించి కీలక ప్రకటన చేస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దశ, దిశ మారనుంది. పైగా ప్రస్తుతం కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కీల కమైన నేపథ్యంలో నిర్మలమ్మ పద్దులో దీన్ని పట్టించుకుని పట్టాలెక్కిస్తారా? లేదా? అన్నది చూడాలి. అటు వేతన జీవు లు సైతం ఈ బడ్జెట్‌లో మేలు చేసే నిర్ణయాలు ఉంటాయేమోనని ఎదురుచూస్తున్నారు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచితే పెరిగిన ధరాభారాన్ని ఎంతో కొంత తట్టుకునేందుకు వీలుంటుందని చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో హెచ్ఆర్ఏ మినహాయింపు సైతం పెంచుతారనే చర్చ జరుగుతోంది.

మాటలే..మూటల్లేవు..

ఏటా కేంద్రం ప్రవేశపెడుతున్న వార్షిక బడ్జెట్‌లో జిల్లాలో కీలక ప్రాజెక్టులకు నిధులు విడుదలవుతాయనకుంటే ప్రతిసారీ రిక్తహస్తమే.విభజన సమయంలో జిల్లాకు ప్రకటించిన ఏ ప్రాజెక్టును కేంద్రం పట్టించుకోవడం లేదు. అసలు వాటి ఉనికినే పక్కనపడేసింది. ప్రధానంగా రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు ఒక్కో కీలక ప్రాజెక్టు ప్రకటించింది. అందులో భాగంగా కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఒక్కో దానికి రూ.150 కోట్లు ఇస్తామని మాట ఇచ్చింది. తద్వారా ఈ రెండు క్యాంపస్‌ల రాకతో అటు యువతకు ఉద్యోగావకాశాలు,పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అంతా భావించారు. దీనికి తగ్గట్లే 2014 తర్వాత ఈ రెండింటికీ అప్పటి బడ్జెట్‌లో కేంద్రం చెరో రూ.10 కోట్లు కేటాయించింది. ఈ రెండు క్యాంపస్‌లు చాలా వేగంగా అందుబాటులోకి వస్తాయని అంతా భావించారు. ఎలాగూ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగడంతో అప్పట్లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో ఈ రెండు విద్యాసంస్థల ఏర్పాటుకు 50 ఎకరాలు సిద్ధం చేశారు. ఆ తర్వాత కేంద్రం వీటి ఊసే మర్చిపోయింది. పదేళ్లగా కేంద్రం బడ్జెట్‌లో చిల్లిగవ్వ కూడా విదల్చడం మానేసింది. గతేడాది అతికష్టంపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ క్యాంపస్‌ను తాత్కాలికంగా కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటుచేశారు. ఈ బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయిస్తే సమస్యలు తీరే అవకాశం ఉంది. కొత్త క్యాంపస్‌లకు శాశ్వత భవనాలు సమకూరేలా కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉంది. గతేడాది కాకినాడకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జేఎన్టీయూలో తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభించడం విశేషం.ఈ నేపథ్యంలో వీటికి నిధులు కేటాయించాలని అంతా కోరుతున్నారు.

కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్ పడేనా!

ఎన్‌డీఏ ప్రభుత్వం ఆశలెన్నో

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై ఆశలు చిగురిస్తున్నాయి. రాజమహేంద్రవరం ప్రధాన స్టేషన్ అభివృద్ధి చేయడానికి కేంద్రం నిధులు ఇవ్వనున్నట్టు సమాచారం. పార్లమెంట్‌లో మంగళవారం రైల్వే బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఉండడం వల్ల ఈసారి బడ్జెట్‌లో రాష్ట్రంతో పాటు జిల్లాకు మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో సోమవారం రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఢిల్లీలో భేటీ అయ్యారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌తో పాటు జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద రూ.269 కోట్లు కేటాయించడానికి మంత్రి సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. బడ్జెట్‌లో అధికారికంగా వీటిని ప్రకటించవచ్చు. చాలా కాలంగా పెండింగ్‌లో కొవ్వూరు -భద్రాచలం రైల్వే లైన్ చర్చకు రానుంది. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి 2011లో నాటి ఏపీ ప్రభుత్వం 923.23 కోట్ల ప్రతిపాదించింది. ఫిఫ్టీ ఫిఫ్టీ కేటాయించేలా నిర్ణయించారు. ఈ మేరకు డీపీఆర్ తయారుచేయడానికి రూ.5 కోట్లు కేటాయించారు. కానీ తరువాత పట్టాలెక్కలేదు. జిల్లా మీదగా థర్డ్‌లైన్ నిర్మించడం, నిడదవోలు రైల్వే జంక్షన్ అభివృద్ధి వంటి అంశాలపై ఎటువంటి నిర్ణయం వెలుడుతుందోననే ఆసక్తి నెలకొంది. గతంలో థర్డ్‌లైన్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచి కాంట్రాక్టు ఒకే అయిన తర్వాత నిలిపి వేశారు. మళ్లీ దాని ఊసెత్తలేదు. మరో పక్క గోదావరిపై మరో రైల్వే వంతెన అవసరమనే వాదన మొదలైంది. నేటి బడ్జెట్‌లో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటారోననే దానిపై ఆసక్తి నెలకొంది.

'ఏలేరు' నిండుతోంది..



ఏలేశ్వరం, జూలై 22: ఏలేరు రిజర్వాయర్‌లోకి సోమవారం ఎగువ కాలువ నుంచి 17610 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. గతంలో ఎన్నడూలేని రీతిలో భారీ స్థాయిలో నీరు చేరడంతో నీటిమట్టం పెరిగింది. పురుషోత్తపట్నం పథకం నుంచి మరో 875 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 75.61 మీటర్ల స్థాయిలో 8.86 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. గత 24 గంటల వ్యవధిలో 2.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నానికి 200 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 60 క్యూసెక్కుల వంతున నీరు చేరుతోంది.

'తాండవ' పొంగుతోంది..



కోటనందూరు,జూలై22: ఎగువ ప్రాంతంలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయర్ నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతమైన గొలుగుండ మండలంలోని బొడ్డేరు, ధారగెడ్డ, బోరింగు గెడ్డ లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. వారం రోజులకు ముందు కేవలం కనిష్ఠ నీటిమట్టానికే ఉన్న రిజర్వాయర్ వారం రోజుల వ్యవధిలో సుమారు 13 అడుగులు మేర పెరిగి సోమవారం నాటికి 369 అడుగులుగా నమోదైనట్లు డీఈ అనురాధ తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 2300 క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని చెప్పారు.

నిండు కుండలా 'భూపతిపాలెం'



రంపచోడవరం, జూలై 22: గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భూపతిపాలెం జలాశయం నిండు కుండలా మారింది. కొండ కాలువల నుంచి జలాశయానికి నీరు చేరడంతో అధికారులు మూడు గేట్లు ఎత్తి నీటిని ముసురుమిల్లి జలాశయానికి వదిలారు.

కూనవరం వద్ద బ్రిడ్జి అనుకుని ప్రవహిస్తున్న శబరినది



గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది..అంతకంతకూ ఉధృతి పెరుగుతోంది..భద్రాచలం వద్ద ప్రమాదకర స్థితిలో గోదావరి ప్రవాహం ఉంది. ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. విలీన మండలాలైన చింతూరు, ఎటపాక, వరరామచంద్రపురం, కూనవరంలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. మరోవైపు ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం పెరగడంతో దిగువకు లక్షలాది క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల వైపు నీరు చేరుతోంది...

వరద గోదారి

వణుకుతున్న పరివాహక ప్రాంతాలు

వాగుల ఉధృతి

వెలగపల్లి-దోనలంక మధ్య పొంగిన వాగు



దేవీపట్నం, జూలై 22: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శబరి, కిన్నెరసాని నదులు పొంగి ప్రవహించడంతో గోదావరి నదికి వరదనీరు చేరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద రెండో ప్రమాదక హెచ్చరిక జారీ చేయడంతో ప్రవాహం మరింత ఎక్కువైంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండి పోశమ్మ ఆలయం పూర్తిగా నీట మునిగింది. ఆదివారం సాయంత్రం గోపురం వరకు చేరిన వరద నీరు సోమవారం మరింత పెరగడంతో పూర్తిగా మునిగిపోయింది. ఎడతెరిపి లేని వర్షం కురవడంతో సీతపల్లి, వెలగపల్లి, దోనలంక తదితర వాగులు పొంగి ప్రవహించాయి.



పి.గన్నవరం: గంటిపెదపూడిలో లంక గ్రామస్తుల ఇబ్బందులు



పి.గన్నవరం: గంటిపెదపూడిలో ఇంజన్ బోటుపై రాకపోకలు



పునరావాస కేంద్రంలోనే వంట



కలెక్టర్ దినేష్ పర్యటన

చింతూరు, జూలై 22: శబరి దోబూచులాడుతోంది. తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. ఇక భద్రాచలంలో గోదావరి పెరుగుతూనే ఉంది. దీంతో ముంపు ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో వందకు పైగా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వారంతా నిత్యావసర సరుకుల కోసం అవస్థలు పడుతున్నారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం ఆదివారం రాత్రికి 39.5 అడుగులకు చేరింది. కాగా సోమవారం ఉదయానికి ఒక్క అడుగు తగ్గి 38.5 అడుగులకు చేరుకుంది. దీంతో ముంపు ప్రాంత వాసులు ఒకింత ఊపిరి పీల్చుకున్నారు. కానీ సోమవారం సాయంత్రం నుంచి తిరిగి శబరి నది పెరగడం మొదలైంది. దీంతో సోమవారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరి నీటిమట్టం తిరిగి 39 అడుగులకు చేరుకుంది. ఇక భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 49 అడుగులకు చేరుకుంది. దీంతో అక్కడ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద స్థాయి మరింత పెరిగే అవకాశం ఉందంటూ అధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రంతో పాటు ఒడిసాలో కూడా విస్తారంగా వర్షం కురుస్తున్న క్రమంలో సీలేరు జల విద్యుత్ కేంద్ర రిజర్వాయర్లు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి. దీంతో డ్యాం గేట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేసే పరిస్థితి ఏర్పడనుందని డొంకరాయి కార్యనిర్వాహక ఇంజనీరు ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ ఒక్కరూ సీలేరు నది మీదుగా దాటే ప్రయత్నం చేయవద్దని, పశువులను కూడా ఆ వైపు వెళ్లకుండా చూసుకోవాలని డొంకరాయి జలాశయ కేంద్రం దిగువ గ్రామస్థులకు సూచనలిచ్చారు. దీంతో ముంపు ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరరామచంద్రపురం, చింతూరు మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు చింతూరు మీదుగా ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ రాష్ట్రాలకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. గత మూడు రోజులుగా చింతూరు మండలం చట్టి వద్ద లారీలు ఇతరత్రా వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో వారంతా వాహనాల్లోనే వంటలు చేసుకుంటున్నారు. పలు కుటుంబాలు స్వచ్ఛందంగా కర్రలతో పూరిపాకలు వేసుకుని పునరావాసాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. వారంతా తమకు టార్పాలిన్లు, కొవ్వొత్తులు, దోమతెరలతో పాటు ఇతర నిత్యావసర సరుకులను సమకూర్చాలని కోరుతున్నారు. దోమల బెడద మరింత ఎక్కువగా ఉందంటూ వారంతా వాపోతున్నారు. పలు ముంపు గ్రామాలకు నాటు పడవలు సమకూర్చాలని కోరుతున్నారు. 30వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు చేరడంతో పలు వాహనాలు చిక్కుకున్నాయి. దీంతో ఆయా వాహనాలను పోలీసు శాఖ ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిసా రహదారుల వెంబడి ప్రయాణాలను పోలీసులు పూర్తిగా నిషేధించారు. సోమవారం అల్లూరి సీతారామరాజు కలెక్టర్ దినేష్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే బృందం విలీన మండలాల్లో పర్యటించి బాధితుల అవసరాలను తెలుసుకున్నారు.

వరద భయం

ఎటపాక మండలంలో పునరావాస కేంద్రాలకు తరలిపోతూ..



ఎటపాక, జూలై 22: భద్రాచలం-కూనవరం రహదారిని వరద ముంచెత్తింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూరుమూరు- పోలిపాక గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహించింది. దాంతో అర్ధరాత్రి నుంచి భద్రాచలం- కూనవరానికి వాహన రాకపోకలు స్తంభించాయి. అలాగే నందిగామ, మురుమూరు, గౌరిదేవిపేట, నెల్లిపాక, వీరాయిగూడెం, నల్లకుంట గ్రామాల వద్ద ప్రధాన రహదారులపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. వీరాయిగూడెం- నెల్లిపాక గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించడంతో వీరాయిగూడెం గ్రామ గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లగూడెం, గన్నవరం గ్రామాల్లోని ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. నెల్లిపాక, రాయనపేట వద్ద గోదావరి వరదను టీడీపీ రాష్ట్ర నాయకులు జమాల్‌ఖాన్ మండల అధ్యక్షుడు పుట్టి రమేష్‌తో కలిసి పరిశీలించారు.



పి.గన్నవరం మండలం గంటిపెదపూడిలో నీటమునిగిన మిర్చి

సుద్దగడ్డకు పోటెత్తిన వరద నీరు



గొల్లప్రోలు పట్టణ శివారులో రోడ్డుపై సుద్దగడ్డ నీరు

గొల్లప్రోలు, జూలై 22: ఎగువ ప్రాంతాలతో పాటు స్థానికంగా కురుస్తున్న వర్షాలతో సుద్దగడ్డకు వరద నీరు పోటెత్తింది. సోమవారం గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ(కొండ)కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై నాలుగు అడుగుల ఎత్తున ప్రవహిస్తున్నది. దీంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే సమయంలో వరద నీరు స్వల్పంగా ఉండిపోవడంతో ఇదే మార్గంలో వెళ్లిన విద్యార్థులు తిరిగి కాలనీకి చేరేందుకు అవస్థలు పడ్డారు. పంటపొలాలు మీదుగా రాకపోకలు సాగించారు. మరోవైపు వరదనీట మునిగిన రహదారిపై భారీ గోతులు పడటంతో నీటిని దాటేందుకు కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపైకి సుద్దగడ్డ వరద నీరు చేరింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి వరకూ సుద్దగడ్డ వరద ఉధృతి పెరుగుతుండటంతో పట్టణంలోని ఈబీసీ, ఎస్సీ, అరుంధతీయ కాలనీ వాసులు, దేవీనగర్, కంకరరేవడ్లు తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గొల్లప్రోలు జగనన్న కాలనీ రహదారిపై వరద పరిస్థితిని తహసీల్దారు ఉదయభాస్కర్, ఎస్ఐ జానీబాషా పరిశీలించారు. జనసేన నాయకులు పర్యటించారు.

ప్రతి గంటకు సమాచారమందిస్తాం

- అప్రమత్తంగా ఉండండి
- అధికార యంత్రాంగం అండగా ఉంటుంది
- పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు కల్పిస్తాం
- నిత్యావసర సరుకులు అందిస్తాం
- అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, జూలై 22: వరద తీవ్రతపై బాధిత గ్రామాలకు గంట గంటకూ సమాచారం అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. విలీన మండలాల్లోని ముంపు ప్రభావిత గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. అనంతరం చింతూరులో పత్రికా ప్రకటన విడుదల చేశారు. గోదావరి, శబరి నదులు వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. విలీన మండలాల్లో 177 గ్రామాలు ప్రభావితమయ్యే పరిస్థితి ఉందన్నారు. చింతూరు, డొంకరాయితో పాటు భద్రాచలానికి చెందిన సెంట్రల్ వాటర్ కమిషన్ ద్వారా వరద హెచ్చరికలను జారీ చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే భద్రాచలంలో గోదావరి నది 49 అడుగుల మేర ప్రవహిస్తుండడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారన్నారు. విలీన మండలాల్లో 149 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐటీడీఏ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా బాధితులకు బియ్యం, కందిపప్పు, పామాయిల్, కూరగాయలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 44 బోట్లను అందుబాటులో ఉంచామని, 4600 లీటర్ల కిరోసిన్ సరఫరా చేసినట్లు చెప్పారు. ప్రతి పడవకు 12 లైఫ్ జాకెట్లు అందించామన్నారు. వైద్యశాఖను అప్రమత్తం చేశామన్నారు. శానిటేషన్ పనులు కూడా ప్రారంభించామని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

భయం గుప్పెట్లో..

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- దిగువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు
- లంక గ్రామాల వైపు వరద నీరు..



ధవళేశ్వరం, జూలై 22: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో అంతకంతకు పెరుగుతున్న గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం 7 గంటలకు ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 11.77 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10 లక్షల క్యూసెక్కులు పైబడి వరదనీరు దిగువకు ప్రవహించింది. సరాసరి గంటకు 15 వేల క్యూసెక్కులు చొప్పున ప్రవాహం పెరగ్గా నీటి మట్టం 2 పాయింట్లు చొప్పున పెరుగుతోంది. రాత్రి 12 గంటలకు నీటి మట్టం 13.60 అడుగులుగా నమోదు కాగా 12,68,958 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. అర్ధరాత్రికి నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి(13.75 అడుగులు)కి చేరవచ్చని అధికారుల అంచనా. కాగా ఎగువన భద్రాచలం వద్ద నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి రాత్రి 12గంటల సమయంలో 50.20 అడుగులకు చేరుకుంది. సాయంత్రం 5 గంటల నుంచి పెరుగుదల కొంత నెమ్మదించినా తాలిపేరు నుంచి వచ్చిన వరదనీటితో మరలా నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. దిగువన శబరి పరివాహకం నుంచి వస్తున్న వరదనీరు నెమ్మదించడంతో కుంట వద్ద నీటి మట్టం తగ్గుముఖం పట్టింది.

● ఎగువ నీటి మట్టాలు ఇవే

ఎగువున కాళేశ్వరం వద్ద నీటి మట్టం 12.390 మీటర్లు వరకు పెరిగి నిలకడగా కొనసాగుతుండగా పేరూరు వద్ద 17.260 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.470 మీటర్లు, భద్రాచలం వద్ద 49.40 అడుగులు, కూనవరం వద్ద 20.190 మీటర్లు నీటి మట్టం పెరుగుతుండగా కుంట వద్ద 13.30 మీటర్లకు పెరిగిన నీటి మట్టం తగ్గుముఖం పట్టి 12.500 మీటర్లకు చేరుకుంది. పోలవరం వద్ద నీటి మట్టం 12.900 మీటర్లకు చేరి పెరుగుతుండగా రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.390 మీటర్లుగా నమోదయింది.

నీట మునిగిన ఇసుక నావ

ధవళేశ్వరం, జూలై 22: వరద ఉధృతికి గాయత్రి ఇసుక ర్యాంప్ నుంచి కొట్టుకు వచ్చిన నావ కాటన్ బ్యారేజ్ 1వ గేటు వద్ద మునిగిపోగా నావను గేటు వద్ద నుంచి బయటకు తీయడానికి ఆదివారం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చీకటి పడడంతో పనులు నిలిపివేశారు. సోమవారం గోదావరి వరద ఉధృతి పెరగడంతో నావ పూర్తిగా నీట మునిగింది. గోదావరి నీటి మట్టం తగ్గిన తర్వాత నావను బయటకు తీసే పనులు చేపట్టనున్నారు.



ఆత్రేయపురం:వాడపల్లి పుష్కర ఘాట్‌ను ముంచెత్తిన వరదనీరు



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ సూచనలిస్తున్న కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ● ముమ్మిడివరం

పాపం తాళ్లూరు వాసులు..



కొండలపైకి వెళ్లిపోతున్న తాళ్లూరు వాసులు

రంపచోడవరం, జూలై22: గోదావరికి వరద నీరు పోటెత్తడంతో దేవీపట్నం మండలం తాళ్లూరు గిరిజనులు కొండలపై తలదాచుకుంటున్నారు. అనేక కుటుంబాలు వరదలకు ముందే తమ బంధువుల ఇళ్లకో, ఇతర ప్రాంతాలకో తరలిపోగా సుమారు 10 కుటుంబాల గిరిజనులు గ్రామంలోనే ఉండిపోయి వరద పెరగడంతో గతంలో కొండలపై ఏర్పాటు చేసుకున్న తాటాకుపాకలకు తరలివెళ్లారు. ఈ గ్రామం కొండమొదలు పంచాయతీ పరిధిలోని 11 గ్రామాల్లో ఒకటి కాగా, గతంలో ఈ పంచాయతీలోని 10 గ్రామాలకు మాత్రమే చట్ట ప్రకారం పునరావాస చర్యలను అమలు చేసేందుకు అధికారులు ఒప్పందం కుదుర్చుకోగా, ఈ ఒక్క గ్రామాన్ని అధికారులు నిర్లక్ష్యం చేశారు. కనీసం ఈ గ్రామంలోని నిర్వాసితులు కోరుకున్న చోట పునరావాస కాలనీని నిర్మించకపోగా, పొమ్మనకుండా పొగపెట్టిన చందంగా ఈ గ్రామాన్ని వరదలకు వదిలేస్తూ వచ్చారు. అధికారులు కోరుకున్నట్టుగానే వారి నిర్లక్ష్యాన్ని తట్టుకోలేని గిరిజనులు పునరావాసం అందకపోయినా క్రమేణా గ్రామాన్ని వదిలి వచ్చేస్తున్నారు. ఈ విధంగా వచ్చేయగా ఇంకా 10 కుటుంబాల నిర్వాసిత గిరిజనులు గ్రామంలోనే ఉండిపోయి వరద బాధితులుగా మారారు. గ్రామాన్ని వరద చుట్టేయడంతో తమ నాటుపడవల సాయంతో కొండలపైకి చేరుకున్నారు.

జల దిగ్బంధంలో 46 గ్రామాలు



కోతులుగుట్ట పునరావాస కేంద్రంలో బాధితులు

కూనవరం, జూలై 22: ఒక వైపు వాన... మరో వైపు వరద.. ఎదురుగా ఉగ్రరూపం దాల్చిన శబరి గోదావరి ప్రవాహం.. వీటితో కూనవరం మండల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా వరద పెరుగుతూ వస్తుండడంతో పునరావాసం వైపు పరుగులు తీశారు. దీంతో కూనవరం ఖాళీ అయింది. గ్రామాన్ని విడిచి వరద బాధితులు కోతులగుట్ట, ఫారెస్టు ఆఫీసుతో పాటు పక్క గ్రామాలకు పునరావాసాలకు తరలివెళ్లి పోయారు. ఒక్క ఏపీఆర్ పాఠశాలలోనే సుమారు 400 దళిత కుటుంబాలు తలదాచుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాన కురుస్తుండడంతో చంటి బిడ్డలను పట్టుకుని పునరావాసానికి వెళ్లిపోయారు.శబరికొత్తగూడెం, కూనవరంలోని ఉదయ భాస్కర్‌కాలనీ, గిన్నెల బజారు గ్రామాలు నీట మునిగాయి. మండలంలో సుమారు 46 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భద్రాచలానికి పూర్తిగా రాకపోకలు స్తంభించిపోయాయి. మండలంలోని ఒక గ్రామం నుంచి ప్రజలు మరో గ్రామానికి వెళ్లాలంటే రోడ్లపై వరదనీరు చేరడంతో పక్కనే ఉన్న అడవుల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. దీంతో నిత్యావసర సరుకుల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోజంతా ముసురుండడంతో బయటకు వెళ్లలేని పరిస్థితి. అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మండలంలో పర్యటించి పరిస్థితులు సమీక్షించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ ముంపు మండలానికి ఒక ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. కూనవరం మండలానికి సంబంధించి చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య కృష్ణ పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. గ్రామాల చుట్టూ నీరు చేరడంతో తెలంగాణ నుంచి నిత్యావసర సరుకులు, కూరగాయలు దిగుమతి చేసుకోలేకపోతున్నామని దీనికి గాను భద్రాచలం వెళ్లేందుకు బోదునూరు అడవి గుండా ఏడుగురాళ్లపల్లి మీదుగా ఉన్న రహదారికి తక్షణమే మరమ్మతులు చేయించాలని టీడీపీ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి వెంటనే స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. రిజర్వు ఫారెస్టులో ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు పర్యవేక్షించాలని స్థానిక అటవీశాఖాధికారి మోహిణివిజయలక్ష్మికి సూచించారు. మరోవైపు పునరావాస కేంద్రంతో పాటు జలమార్గంలో ఉన్న గ్రామాల్లో సైతం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ తెలిపారు. తక్షణమే వారికి కిరోసిన్, కంది పప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలతో పాటు టార్పాలిన్లు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్-2024

తుది దశ కౌన్సెలింగ్

జేఎన్టీయూకే, జూలై 22: ఏపీఈఏపీసెట్-2024 అడ్మిషన్లకు సంబంధించి ఎంపీసీ విభాగం అభ్యర్థులకు తుది దశ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లో తొలి దశ వెబ్ కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ సోమవారం జారీ చేశారు. ఈనెల 25వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు చేసుకోవచ్చని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురం ఆంధ్రాపాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రిన్సిపాల్ జనార్ధన్‌రావు తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సంప్రదించాలి. 7995681678, 7995865456, 9177927677 హెల్ప్ డెస్క్ నెంబర్లకు కూడా ఫోన్ చేయవచ్చు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తుంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు. ర్యాంకు కార్డు, రేషన్ కార్డు, హాల్ టికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారికి 2022 నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతిఏటా అమలు చేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు,
- రిజిస్ట్రేషన్: ఈనెల 23 నుంచి 25 వరకూ.
- అప్‌లోడెడ్ ధ్రువపత్రాల పరిశీలన: ఈనెల 26 వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు: ఈనెల 24 నుంచి 26 వరకూ..
- ఆప్షన్ల మార్పు: ఈనెల 27
- సీట్ల కేటాయింపు: ఈనెల 30
- సెల్ఫ్ రిపోర్టింగ్, కళాశాలల్లో రిపోర్టింగ్: ఈనెల 31 నుంచి ఆగస్టు 3 వరకూ..

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కుల జాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి. మొదటి దశ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు మాత్రమే షెడ్యూల్‌లో పేర్కొన్నవన్నీ చేయాలి. ఆ విధంగా కాకుండా తొలిదశలో సీటు పొంది తుది దశకు కూడా ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు కేవలం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకుంటే సరిపోతుంది. తొలి దశలో పొందిన సీటు తుదిదశలో సంబంధిత విద్యార్థికి సీటు కేటాయింపు జరిగిన వెంటనే రద్దవుతుంది.

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.28.80 లక్షలు

మామిడికుదురు, జూలై 22: అప్పనపల్లి బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.28,80,990 వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.మాధవి తెలిపారు. 54 రోజులుకు గాను హుండీ లెక్కింపును సోమవారం నిర్వహించగా 1.500 మిల్లీగ్రాముల బంగారం 93 గ్రాముల వెండి వచ్చిందని ఏసీ తెలిపారు. లెక్కింపు కార్యక్రమానికి జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ దూనబోయిన నాగమల్లేశ్వరరావు ప్రత్యేకాధికారిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

ఏటేటా ఈ బాధలు పడలేం

పరిహారం ఇప్పించండి సారూ..కలెక్టర్‌కు నిర్వాసితుల వినతి

చింతూరు, జూలై 22: 'ఏటేటా ఈ బాధలు పడలేం. వర్షాకాలం వచ్చిందంటే చాలు కంటి మీద కునుకు ఉండటం లేదు. కడుపు నిండా తిండి ఉండటం లేదు. దయచేసి మాకు పరిహారం ఇచ్చి పునరావాసం కల్పించి ఇక్కడ నుంచి శాశ్వతంగా సురక్షిత ప్రాంతానికి తరలించండి' అంటూ ముంపు బాధితులు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ముందు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ దినేష్‌కుమార్ బృందం సోమవారం చింతూరు, వరరామచంద్రపురం, కూనవరం మండలాల్లోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. కలెక్టర్ వెంట చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఉన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన


నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

వరరామచంద్రపురం, జూలై 22: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం పర్యటించారు. రేఖపల్లిలోని పునరావాస కేంద్రాలలో ఉన్న వరద బాధితులను పరామర్శించారు. బాధితులకు రేషన్, పప్పు, కిరోసిన్ పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. టార్పాలిన్స్ పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వరద బాధితులకు అసౌకర్యం లేకుండా చూడాలన్నారు. టీడీపీ, సీపీఎం నాయకులు కలెక్టర్‌దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. కొన్ని చోట్ల ఇంజన్ బోట్లు ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే కలెక్టర్ తహసీల్దార్‌కు ఆదేశాలిచ్చారు. ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, తహశీల్దార్ మౌలానాఫాజిల్, ఎంపీడీవో ఫణీందర్ పాల్గొన్నారు.

అత్యవసర వైద్యం అందక వృద్ధురాలి మృతి

రాజవొమ్మంగి జూలై 22: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి ప్రవహించి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ఓ వృద్ధురాలు అత్యవసర వైద్యం అందక మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మండలంలోని తంటికొండ పంచాయతీ గింజర్తి గ్రామానికి చెందిన కుంజం రాజులమ్మ (65)కు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో గుండెల్లో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళదామనుకున్నారు. అయితే ఎర్రంపాడు-వట్టిగెడ్డ గ్రామాల మధ్య కాజ్‌వే పైనుంచి కొండ వాగు పొంగి ప్రవహించడంతో గ్రామం దాటి వెళ్లేందుకు లేకుండా అయిపోయిందని దీంతో కాసేపటికే రాజులమ్మ మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వై.రామవరం, జూలై 22: ఏజెన్సీ గ్రామాల్లో వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలంటూ అల్లూరి జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి(డీసీహెచ్ఎస్) కె.కృష్ణారావు వైద్యులకు సూచించారు. వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న రక్త పరీక్షలు, ఎమర్జెన్సీ ప్రసూతి విభాగాలను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ సేవలను మరింత మెరుగుపరచాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల నిర్మూలనకు తగిన మందులు అందుబాటులో ఉంచినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ డీసీహెచ్ఎస్‌కు తెలిపారు. రూ.4 కోట్లతో నిర్మాణంలో ఉన్న పైఅంతస్తులోని ఆసుపత్రి భవనానికి మెట్లు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటిని పూర్తి చేయాలంటూ రాహుల్ కోరారు. సమస్యపై ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తానని డీసీహెచ్ఎస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి గడ్డపై చిక్కుకున్న పశువులు

ఆందోళనలో యజమానులు..

ఎటపాక, జూలై 22: ఎటపాక మండలం గౌరీదేవిపేటలోని గోదావరి నది మధ్యలో ఉన్న (500 ఎకరాల)గడ్డపై మేతకు వెళ్లి పశువులు ఆ ప్రాంతంలో చిక్కుకున్నాయి. నందిగామ, గౌరీదేవిపేట గ్రామాలకు చెందిన పశువులు గడ్డపై ఉండిపోయాయి. వరదలు రాక ముందు ఈ గ్రామాలకు చెందిన పశువులు మేతకోసం ఆ ప్రాంతానికి వెళ్లాయి. మూడు రోజుల్లో గోదావరి వరద తీవ్రత పెరగడంతో పశువులు బయటకు రావడానికి వీల్లేకుండా పోయింది. వరద పోటు లేకుండా ఉంటే పశువులు యథావిధిగా తిరిగి వచ్చేవి. కానీ వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఆ గడ్డపై చిక్కుకుపోయాయి. పశు యజమానులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు చేతులెత్తేసినట్లు చెబుతున్నారు. పశు యజమానులు ఆ ప్రాంతానికి వెళ్లేందుకు బోట్లలో డీజిల్ ఖర్చులు భరించాలని, డీజిల్ భారం భరిస్తేనే వస్తామంటూ చెప్పారని యజమానులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పశు యజమానులు కోరుతున్నారు.

భద్రాచలం వెళ్లాలంటే రూ.500

కూనవరం, జూలై22: గోదావరి వరద రావడంతో కూనవరం నుంచి భద్రాచలం వెళ్లడానికి రూ.300 నుంచి రూ.500 ఖర్చవుతోంది. సాధారణంగా కూనవరం నుంచి భద్రాచలంకు 50 కిలోమీటర్లు. ఆర్టీసీ బస్సులో వెళ్లాలంటే రూ.50 ఖర్చవుతుంది. అదే ప్రైవేటు వాహనాలైతే రూ.70 వసూలు చేస్తారు. కానీ భద్రాచలం ప్రధాన రహదారిపైకి గోదావరి వరద నీరు చేరడంతో ప్రైవేటు వాహనాలు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గంలో ప్రయాణికులను భద్రాచలం తీసుకెళ్తున్నాయి. దీనికి గాను ఒక్కొక్కరి నుంచి రూ.300 నుంచి రూ.500 వసూలు చేస్తుండడంతో ప్రయాణికులకు కొంత ఇబ్బంది కలుగుతోంది. అత్యవసర పని ఉండడంతో ప్రయాణం తప్పడంలేదని ఎంత ఖర్చయిన వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు.

పొంగుతున్న వాగులు

మోతుగూడెం, జూలై 22: చింతూరు మండలం మోతుగూడెంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మోతుగూడెం పరిధిలో ఉన్న తడికి వాగు, పెద్ద వాగు, సోకులేరు వాగు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులన్నీ పొంగుతున్నాయి. సీలేరు నదికి భారీగా వరద నీరు వస్తుండడంతో నిండుకుండగా మారింది. చెరువులు కుంటలు నిండిపోయాయి.

దాశరథి కృష్ణమాచార్యులకు నివాళులు

వై.రామవరం, జూలై22: మండలంలోని పి.యర్రగొండ గురుకుల పాఠశాలలో సోమవారం దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ ఆధ్వర్యంలో కృష్ణమాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్యములను ఆయుధంగా మలిచి పీడిత ప్రజల పక్షాన పోరాడిన యోధుడు, తన రచనలతో తెలంగాణ బిడ్డలలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులను కొనియాడారు. పీడీఏస్‌యూ గౌరవాధ్యక్షుడు ఐవీ రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో పనిచేసిన మొబైల్ నెట్‌వర్క్

కూనవరం, జూలై 22: కూనవరం మండలంలో ఒకవైపు గోదావరి వరద ముంచుకొస్తుండడంతో కొన్ని ప్రైవేటు ఫోన్ నెట్‌వర్క్ సంస్థలు సిగ్నల్స్‌ను నిలిపివేశాయి. దీంతో వరద బాధితులు ఇబ్బంది పడ్డారు. దూరంలో ఉన్న బంధువుల సమాచారం తెలుసుకోలేక తమ పరిస్థితి బంధువులకు వివరించలేక ఆందోళన చెందారు. అంతే కాకుండా ఫోన్‌పే, గూగుల్‌పే సైతం నిలిచిపోవడంతో ఆర్థిక లావాదేవీలకు ఇబ్బందులు తలెత్తాయి.. ఈ విషయం తెలుసుకున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ నిలిచిపోయిన ప్రైవేటు నెట్‌వర్క్ సిగ్నల్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆయా సంస్థలను ఆదేశించారు. సిగ్నల్స్ పునరుద్ధరించడంతో ప్రజలు సైతం ఊపిరిపీల్చుకున్నారు. కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పునరావాస కేంద్రంలో నిత్యావసరాల పంపిణీ

చింతూరు, జూలై 22 : ఎర్రంపేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు ప్రభుత్వం నిత్యావసరాలను సోమవారం పంపిణీ చేసింది. కూటమి నేతలు బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, టీడీపీ నాయకులు మల్లెల వెంకటేశ్వరరావు, ఓబుళ్లనేని నర్సింహారావుచౌదరి, ఎస్‌ఏ ఆసిఫ్, బీజేపీ మండల అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, జనసేన నాయకులు తీగల రవి, తీగల కవిత తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ప్రచారం మానుకోవాలి'

దివాన్‌చెరువు, జూలై 22: కూటమి ప్రభుత్వంపై అసత్యప్రచారాలు చేసే విధానాన్ని మానుకోవాలని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు మాజీ సీఎం జగన్‌కు హితవు పలికారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి పట్టుమని నెలరోజులు కూడా కాకముందే జగన్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ కార్యకర్తలపై ఎంతో అభిమానం ప్రదర్శిస్తున్న జగన్ తన సొంత బాబాయ్ హత్య కేసు వేగంగా దర్యాప్తు పూర్తిచేసి నిందితులకు శిక్ష పడేవిధంగా ఐదేళ్ల పాలనలో ఎందుకు ప్రయత్నించలేదని ప్రశ్నించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉండండి


ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ కిషోర్

▸ ఎస్పీ కిషోర్.. ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ తనిఖీ

ధవళేశ్వరం, జూలై 22: తమ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారికి తగిన సహాయం అందించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసి తనిఖీ చేశారు. ఆయనకు డీఎస్పీ అంబికా ప్రసాద్, సీఐ వినయ్‌మోహన్, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించిన ఎస్పీ నమోదైన కేసులపై ఆరా తీశారు. స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా విధులు నిర్వర్తించాలని మద్యం, గంజాయి, సారా అక్రమరవాణాను నియంత్రించే విధంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా కొత్త చట్టాలు గురించి వివరించారు. సిబ్బందికి సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే కృషి చేస్తానన్నారు. అనంతరం మొదటి ప్రమాదహెచ్చరిక జారీ కావడంతో స్నానఘాట్‌లను పరిశీలించారు. ఎవరూ గోదావరిలోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాటన్ బ్యారేజ్ పైనుంచి గోదావరి ఉధృతిని, బ్యారేజ్ గేటు వద్ద నావ మునిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

శిక్షాసప్తాహ్‌ను విజయవంతం చేయండి

▸ రాజమహేంద్రవరం డీవైఈవో నారాయణ

▸ పలు ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల సందర్శన


అనపర్తి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంఈవో సత్తిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22: కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం ప్రారంభించి నాలుగేళ్ళు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న విద్యావారోత్సవాలు (శిక్షాసప్తాహ్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజమహేంద్రవరం డీవైఈవో ఈవీబీఎన్.నారాయణ అన్నారు. సోమవారం పలు ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. మునిసిపల్ కాలనీలో బీఈఎం స్కూల్‌లో శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో తొలి రోజు టీఎల్ఎమ్ ప్రదర్శన ప్రారంభించారు. 29వ తేదీ వరకు వారోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం గోరక్షణ పేటలో బీఎస్ఎస్ఎస్ బీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల, ఆంధ్రనగర్‌లోని పవర్స్ ఎయిడెడ్ ఇంగ్లీషు మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు.డీవైఈవో వెంట అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఉన్నారు.

అనపర్తి: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన శిక్ష సప్తాహ్ కార్యక్రమాలకు ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి విచ్చేసి నూతన జాతీయ విద్యా విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శిక్ష సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో మొదటిరోజున టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నూతన విద్యా విధానాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. మండలంలో నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్ కార్యక్రమాలను ఏఎంవో గౌరీశంకర్ పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంఈవో పుష్పలత, సీఆర్పీలు శివ, నాగరాజు, సురేంద్ర, కుమారి పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సూర్యాపేట ఎంపీపీ పాఠశాల్లో సోమవారం ప్రారంభించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి అన్నారు. ఈనెల 29 వరకు ఉపాధ్యాయులంతా విద్యార్థులను ప్రోత్సహించే విధంగా నైపుణ్యాభివృద్ధి, క్రీడా పోటీలు, సాంస్కృతిక, సాంకేతిక, పర్యావరణ పరిరక్షణ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రంగంపేట ప్రత్యేకాధికారి బాల శంకరరావు


కడియంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంపీపీ ప్రసాద్

రంగంపేట, జూలై 22: తుఫాన్ ప్రభావంతో వర్షాలతోపాటు గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున మండల స్థాయి అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాలశంకరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.వెంకటరత్నం అధ్యక్షతన మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ముంపు గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, పంటలు ముంపుకు గురైనప్పుడు ఉపాధి హామీ కూలీల సహాయంతో తొలగించాలని సూచించారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాల ప్రాంతాల్లోనూ నీటి ముంపును తక్షణమే తొలగించాలన్నారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని శాఖల వారిగా మదింపు చేసి, నివేదికలను ఎంపీడీవో ద్వారా తనకు పంపించాలని అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, ఏవో శ్రీనివాసరావు, ఎంఈవో కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీవో జెస్సీఫ్లోరెన్స్, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

కడియం: వర్షాలకు కడియంలో నీట మునిగిన ఆవ ప్రాంతాలను ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్, ఏవో కె.ద్వారకాదేవి తదితరులు పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. జేగురుపాడు ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ గ్రామంలో పంట మునిగిపోయిందని ఎంపీపీ ప్రసాద్, ఎంపీడీవో, ఏవో దృష్టికి తీసుకెళ్లడంతో గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. అలాగే వేమగిరి, కడియపులంక, పొట్టిలంక గోదావరి పరీవాహక ప్రాంతాలను తహశీల్దారు బి.రమాదేవి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కడియపులంక రేవులో అనుమతి లేకుండా వేట చేస్తున్న ధవళేశ్వరం మత్స్యకారులను గమనించి మత్స్యశాఖాధికారికి అప్పగించారు.

'జగనన్న కాలనీ వాసులను ముంపు నుంచి కాపాడండి'

జేగురుపాడు జగనన్న కాలనీని సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, ఎంపీటీసీ ఆకుల సుధాకర్.. పంచాయతీ కార్యదర్శి శిరీష, సచివాలయం సిబ్బందితో కలిసి పరిశీలించారు. జేసీబీ సాయంతో నీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టారు. వర్షాలతో కాలనీ వాసులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బళ్ల అన్నవరం, పాలపర్తి ప్రకాష్‌కుమార్, సాకా కిరణ్‌కుమార్, నాగిరెడ్డి మోహన్, మద్దుకూరి పుల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు నిధులివ్వండి

▸ ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ చీఫ్‌కు ఎమ్మెల్యే నల్లమిల్లి వినతి


ఏపీఆర్‌డీసీ ఎండీ శ్రీనివాసరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, జూలై 22: మండలంలోని దొంతమూరు-రంగంపేట, రంగంపేట-సింగంపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్లులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ చీఫ్ నాయిముల్లాను కోరారు. సోమవారం విజయవాడలో ఆయనను నల్లమిల్లి కలిసి మాట్లాడారు. ఈ రెండు రోడ్లు ఇప్పటికే అభివృద్ధి చేశామని, నిధుల కొరతతో ఒక కిలో మీటర్ మేర నిలిచిపోయిందని, నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు నాయిముల్లా సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తెలిపారు. అలాగే ఏడీబీ రోడ్డును తక్షణమే మరమ్మతులు చేయించాలని ఇంజనీర్ ఇన్ చీఫ్, స్టేట్ హైవేస్(ఆర్‌అండ్‌బీ) ఎండీ ఏపీఆర్‌డీసీ ఎల్.శ్రీనివాసరెడ్డిని ఎమ్మెల్యే నల్లమిల్లి కోరారు.

కెనాల్ రోడ్డు హైవేగా మార్పుకు సీఎం ప్రతిపాదన

వేమగిరి-సామర్లకోట కెనాల్ రోడ్డులో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల నుంచి త్వరలో మోక్షం కలుగనుంది. ఎన్‌హెచ్ 16, ఎన్‌హెచ్ 216 కనెక్టింగ్ కోసం వేమగిరి సామర్లకోట కెనాల్ రోడ్డు 62 కిలో మీటర్లను నేషనల్ హైవేగా కన్వర్ట్ చేయాల్సిందిగా సీఎం చంద్రబాబు.. కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి ప్రతిపాదనలు పంపారని ఎమ్మెల్యే నల్లమిల్లి విజయవాడ నుంచి అనపర్తి మీడియాకు వెల్లడించారు. కాకినాడ పోర్టు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఏడీబీ రోడ్డుతో బాటు కెనాల్ రోడ్డు అభివృద్ధి జరిగితే ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండవని, అలాగే ద్వారపూడి, బిక్కవోలు, సామర్లకోట ఆధ్యాత్మిక కేంద్రాలుగా ప్రాధాన్యత సంతరించుకున్నందున యాత్రికులు పెరుగుతున్నారని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా కెనాల్ రోడ్డును నేషనల్ హైవేగా కన్వర్టు చేయాలని కేంద్రానికి చంద్రబాబు ప్రతిపాదనలు పంపినట్టు ఆయన తెలిపారు.

హరియాణా గవర్నర్‌ను కలిసిన నల్లమిల్లి

హరియాణా గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకుడు బండారు దత్తాత్రేయను సోమవారం విజయవాడలోని హోటల్ వివంతలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లమిల్లిని గవర్నర్ అభినందించారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

అనపర్తి, జూలై 22: దేశంలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఆలిండియా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నగేష్ తెలిపారు. ఆలిండియా వాక్ పేరుతో రెండో విడత పాదయాత్ర చేపట్టిన ఆయన సోమవారం అనపర్తి చేరుకున్నాడు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దేశంలో పర్యావరణ పరిరక్షణకు పాదయాత్ర చేపట్టానని మొదటి విడతగా విజయవాడ నుంచి చెన్నై పాదయాత్ర నిర్వహించగా ఈ సారి విజయవాడ నుంచి పూరీకి పాదయాత్ర చేస్తున్నానన్నారు. ప్రతి పది కిలోమీటర్లకు ఒక చోట విత్తనాలు నాటుతున్నానని తెలిపారు.

యర్రమోతు ధర్మరాజుకు సత్కారం

ధవళేశ్వరం, జూలై 22: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌గా చెల్లా శంకర్రావు ప్యానల్‌లో పోటీ చేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజును మాజీ సర్పంచ్ పిన్నంటి ఏకబాబు ఆధ్వర్యంలో టీఎన్‌టీయూసీ హార్లిక్ యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మరాజు తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చియ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, టీడీపీ నాయకుడు గన్నికృష్ణలకు, ప్యానల్ విజయం కోసం పని చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిన్నంటి ఏకబాబు, యూనియన్ నాయకులు తప్పిడి ప్రసాద్, కట్టా నరసింహారావు, వలిరెడ్డి భవాని తదితరులు పాల్గొన్నారు. అలాగే జనసేన నాయకులు యడ్ల మహేష్ తదితరులు ధర్మరాజును సత్కరించారు.

కాపవరం స్కూల్లో టీఎల్ఎం పరిశీలన

కోరుకొండ, జూలై 22: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు టీఎల్ఎంను తయారు చేయించి పాఠశాలలో ప్రదర్శించారు. దీనిలో భాగంగా ఎంఈవోలు టి.కుశలవదొర, సుజాత కాపవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంను పరిశీలించారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి

రైతులకు జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు హితవు

గోకవరం, కోరుకొండలో నీట మునిగిన వరి పొలాల పరిశీలన


తంటికొండలో పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి తదితరులు

గోకవరం/కోరుకొండ, జూలై 22: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను రక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని తంటికొండ, కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలుసూచనలు చేశారు. వారంరోజులు వరి పైరు వరదనీటిలోఉన్నప్పటికీ ఎలాంటి నష్టంజరగదని వారం దాటిన తరువాత నష్టం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నారుమడి నుంచి నీటిని పూర్తిగా బయటకు పంపి 5సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ కలిపి వేసుకోవాలన్నారు. ఒక గ్రామ్ కార్బన్‌డజిమ్ లేక మాంకోజెబ్ పిచికారీ చేసుకోవాలన్నారు. పిలకల దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని చెప్పారు. వ్యవసాయాధికారి వెంట ఏడీఏ మల్లికార్జునరావు, ఏవోలు రాజేశ్వరి, గౌరీదేవి, మునగాల, శ్రీరంగపట్నం రైతు భరోసా కేంద్రాల ఏఈవోలు, రైతులు ఉన్నారు.

కాలువలో బాలుడి గల్లంతు

కాలువ పక్కన సైకిల్ లభ్యం.. మిర్తిపాడులో ఘటన



మిర్తిపాడులో బాలుడి కోసం గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, రాంబాబు(ఫైల్)

సీతానగరం, జూలై 22: మండలంలోని మిర్తిపాడు గ్రామం వద్ద ఉన్న కాలువలో ఓ బాలుడు ప్రమాదవశాత్తూ పడి గల్లంతయినట్టు అనుమానిస్తున్నారు. అధికారులు, బత్తుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఐ బృందం గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆ బాలుడు అదృశ్యమైనట్టు భావిస్తున్నారు. కొందరి కథనాల మేరకు తిరుమలా స్కూల్లో పదో తరగతి చదువుతున్న ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన పిప్పళ్ల రాంబాబు(15) హాస్టల్ ఉంటున్నాడు. మూడు రోజులు సెలవులు రావడంతో ఉండేశ్వరపురంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. ఆదివారం సాయంత్రం 6గంటలకు ఇంటి వద్ద సెల్‌ఫోన్ పట్టుకుని ఆడుకోవడంతో తండ్రి వెంకటపతి మందలించాడు. దీంతో సెల్‌ఫోన్ అక్కడ విసిరికొట్టి సైకిల్‌పై బయటకు వెళ్ళిపోయాడు. రాత్రి 9గంటలైనా తిరిగి రాకపోవడంతో పలుచోట్లు వెతికారు. అయినా కనిపించలేదు. బొబ్బిలంక వైపు వంతెన వద్దకు వెళ్లడం చూసినట్టు సెంటర్‌లో కొంతమంది చెప్పడంతో అక్కడికి వెళ్లి చూడగా బొబ్బిల్లంక-మిర్తిపాడు కాలువ వద్ద సైకిల్ కనిపించడంతో కాలువలో పడిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. కాగా రాంబాబు తండ్రి వెంకటపతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆడుకోవడానికి వెళ్ళిన తమ కుమారుడు ఎంతకు తిరిగి రాకపోవడంతో వెతకగా కాలువ వద్ద సైకిల్ కనిపించిందని పేర్కొనట్టు పోలీసులు తెలిపారు. బాలుడి ఆచూకీ కోసం తహశీల్దార్ నెల్సన్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ, ఎంపీడీవో కృష్ణప్రసాద్ బొబ్బిల్లంక వద్ద ఉన్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు బాలుడి జాడ తెలియరాలేదు.

జగన్ టీమ్ ఆందోళన సిగ్గుచేటు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22: సేవ్ డెమోక్రసీ అంటూ మాజీ సీఎం జగన్, ఆయన అనుచరగణం ఆందోళన చేయడం సిగ్గుచేటని టీడీపీ ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ధారా ఏసురత్నం అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాటు సీఎంగా ఉన్న జగన్ ప్రజాస్వామ్యాన్ని ఇష్టాను సారంగా ఖూనీ చేశారన్నారు. రాష్ట్రంలో నిజమైన ప్రజాస్వామ్యం ఇప్పుడే పరిఢవిల్లుతుందన్నారు.

బీసీ సంక్షేమాధికారిని కలిసిన

ఎస్సీ ఉద్యోగ సంఘం నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22: జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బూతాటి శశాంకను ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో సోమవారం శశాంకను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, ధారా ఏసురత్నం, తుళ్ళూరి రఫాయేలు, తలారి జార్జిపాల్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యరమేష్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

రాజమహేంద్రవరం కల్చరల్ జూలై 22: ప్రముఖ బాలీవుడ్ మధుర గాయకుడు ముఖేష్ 102వ జయంతిని సోమవారం సాయంత్రం జిత్ మోహన్ మిత్ర కళావేదికలో నిర్వహించారు. జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ ముఖేష్ దాదాపు 35ఏళ్ల పాటు హిందీ చిత్రాలకు గాయకుడిగా పలు విజయవంతమైన పాటలు పాడారన్నారు. వి.బాలకృష్ణ, హరికృష్ణ, ముఖేష్ పాటలు పాడి స్వర నివాళులర్పించారు. కార్యక్రమంలో వి.జగపతి, జె.శివప్రసాద్, గిరిజాల సోమరాజు నాయుడు, పి.మహేష్, డి.ఎస్.శ్రీనివాస్, రామ్మోహన్, శ్రీపాద శంకరరావు, టి.మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

బిక్కవోలు, జూలై 22: బిక్కవోలుకు చెందిన మినీ వ్యాన్ డ్రైవర్ కమ్ ఓనర్ ఎడ్ల నాని అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులకు సోమవారం గ్రామంలోని మినీ గూడ్స్ వ్యాన్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ రూ.1,11,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పేకేటి శివన్నారాయణ, షేక్ సైజులాల్, పంపన ప్రసాద్, తాళ్లపూడి ప్రకాష్, జంగా విజయ్‌రెడ్డి, గుణ్ణం రమేష్, వైదాడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

బిక్కవోలు, జూలై 22: కాపవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం కొమరపు ప్రసాద్‌బాబు ఆర్థిక సాయంతో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.వీరబాబు, దాత ప్రసాద్‌బాబు, హైస్కూల్ హెచ్ఎం పి.గంగాధరం, పాస్టర్ అనిల్‌కుమార్, పీఎంసీ చైర్మన్ పి. ఆనందరావు, ఉపాధ్యాయులు వి. శ్రీనివాస్, ఎస్. ప్రశాంతి, ఏడుకొండలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నవీనీకరణ

బిక్కవోలు, జూలై 22: ఈనెల 23 నుంచి 27 వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ నవీనీకరణకు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. ఈ సెంటర్లలో 0-5 సంవత్సరాల పిల్లలకు కూడా ఆధార్‌కార్డులకు నమోదు చేయించుకోవచ్చునన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22: భారీ వర్షాలు, గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో ప్రజలందరూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యుల సలహాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాకారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం గోదావరి వరద ఉధృతి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను ఆయన సందర్శించారు. తుపాను బాధితులకు అందుతున్న వైద్యసేవలను ఆయన పరిశీలించారు. వైద్య సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. ప్రస్తుతం అధిక వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యసిబ్బంది ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22: రాజమహేంద్రవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో సోమవారం జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో కాకినాడ టీమ్ బి.సాయి, కె.శ్రీకర్ విజేతలుగా నిలిచారు. సీహెచ్ శ్రీను, హ్యాపీ వినోద్ ద్వితీయస్థానంలో నిలిచారు. ఎస్ అబ్రహం, రవితేజ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు జనసేన నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు డీవీవీ త్రినాధ్ చేతులమీదుగా నగదు బహుమతి, మెమోంటోలు, ధ్రువపత్రాలు అందజేశారు. నిహిత్, శివభరత్, సాయిరెడ్డి, రాయపురెడ్డి భరత్ తదితరులు పాల్గొన్నారు.

దాశరథి శతజయంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22: రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ తెలుగుశాఖ, కళాగౌతమి సంయుక్త ఆధ్వర్యంలో దాశరథి శతజయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు, వై.స్వర్ణశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



ఉరుకులు.. పరుగులు : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి.. నీట మునిగిన డ్రెడ్జింగ్ పడవ

నిండు కుండలా : ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉధృతంగా ఉన్న గోదావరి



వరద పోటు

రెండో ప్రమాద హెచ్చరిక దిశగా గోదారి

- ఒక్కసారిగా పెరిగిన వరద
- సముద్రంలా అఖండ గోదావరి
- ధవళేశ్వరం వద్ద ప్రవాహ ఉధృతి
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- దిగువకు 12.68 లక్షల క్యూసెక్కులు
- 13.60 అడుగులకు నీటిమట్టం
- నీట మునుగుతున్న లంకలు
- ఘాట్లలో కలెక్టర్ నిషేధాజ్ఞలు
- భద్రాచలం వద్ద తగ్గుముఖం

రాజమహేంద్రవరం, జూలై 22 (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : గోదావరి ఉప్పొంగుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరి మహోగ్రరూపం దాల్చింది. ఉపనదులు పొంగి ప్రవహించడంతో అఖండ గౌతమి గోదావరి ఉగ్రరూపం దాల్చి పోటెత్తుతోంది. గత కొన్నిరోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు ఉపనదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఉప నదులైన శబరి, ప్రాణహిత, ఇంద్రావతి, మంజీర, కిన్నెరసాని, మానేరు, ప్రవర, పర్ణ నదుల నుంచి భారీగా వరద వచ్చి గోదావరిలో చేరుతుంది. భద్రాచలం వద్ద ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. మూడో ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి పరవళ్లు తొక్కుతోంది. భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 12 గంటలకు 50.40 అడుగులకు నీటిమట్టం చేరింది. ఆ తరువాత కాసేపటికి 50.20 అడుగులకు చేరి తగ్గుముఖం పట్టింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల మధ్య అఖండ గోదావరి సముద్రంలా మారింది.లంకలన్నీ మునిగిపోతున్నాయి. పలు గ్రామాల నుంచి ప్రజ లను పునరావాస కేంద్రాలకు తరలించారు.ధవళేశ్వరం బ్యారేజి వద్ద సోమవారం ఉదయం 7 గంటలకు మొదటి ప్ర మాద హెచ్చరిక జారీ అయింది. రాత్రి 12 గంటలకు బ్యారేజి నీటిమట్టం 13.60 అడుగులుగా నమోదైంది. బ్యారేజి నుంచి 175 గేట్ల ద్వారా సముద్రంలోకి 12,68,958 క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేశారు. దీంతో కోనసీమ జిల్లాలో పలు గ్రామాలు నీట మునుగుతున్నాయి.ఈ రాత్రికే బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. బ్యారేజి నీటిమట్టం 13.75 అడుగులకు చేరినా, సముద్రంలోకి 13 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వెళ్లినా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.ఈ నేప థ్యంలో తీర ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముంపు, లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని కోరుతున్నారు. వరద గోదావరిని చూడడానికి ప్రజలు అధికసంఖ్యలో క్షేత్రానికి చేరుకుంటున్నారు.కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు ఆధ్వ ర్యంలో గోష్పదక్షేత్రంకు వెళ్లే రహదారుల వద్ద బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. వరద పరిస్థితిని పోలీస్, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.ఇదిలా ఉండగా గోదావరి లంకల్లోని అనేక గ్రామాలు నీట మునిగాయి. గోదావరి ఘాట్ల వద్ద నిషేధాజ్ఞలు కొనసాగి స్తున్నారు. కొవ్వూరు ఘాట్లలో ఆదివారం రాత్రి నుంచి 24 గంటలూ పర్యవేక్షించేలా డ్యూటీలు వేశారు.కొవ్వూరు సీఐ జగదీశ్వరరావు ఘాట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. రాజమహేంద్రవరం ఘాట్లలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ పర్యటించిన తర్వాత ఎవరూ ఘాట్లలోకి వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదావరిలో పడవలు తిరగకుండా నిషేధించారు.. సీతానగరం మండలంలోని ములకల్లంక గ్రామంలో ప్రజలు ఇంకా లంకలోనే ఉన్నారు.వీళ్లను ఖాళీ చేయించడానికి అధికారులు నానా తంటాలు పడుతున్నారు. కొవ్వూరు మండలం మద్దూరులంక, ఇతర లంకల్లో కూడా జనం ఉన్నారు. సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో వరద నీరు అధికంగా ఉండడంతో కాలువలో ఒక బాలుడు గల్లంతయ్యాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.వర్షాలకు దెబ్బతిన్న ఇల్లు కూలడంతో గోకవరానికి చెందిన మేకాని సుబ్బలక్ష్మి గాయాలపాలయ్యారు.



పునరావాస కేంద్రాలకు జనం..

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22 : గోదావరి వరదలు పెరగడంతో రాజమహేంద్రవరం పరీవా హక లంకల నుంచి సుమారు 300 మంది ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణి పర్యవేక్షణలో లంకల నుంచి వరద బాధితులను తీసుకొచ్చారు. చంద్రా సత్రంలో 120 మంది, ఆలకట్ గార్డెన్స్ మునిసిపల్ కల్యాణ మండపంలో 60 మంది ఉన్నారు. కేతావా రిలంక,బ్రిడ్జిలంక ,ఎదుర్లమ్మలంకల నుంచి 130 బోట్లలో ప్రజలను సురక్షితంగా తరలించినట్టు చైత్రవర్షిణి తెలిపారు.ఆమె వెంట ఫైర్ ఆఫీసర్ కే మార్టిన్ లూథర్ కింగ్, అదనపు కమిషనర్ పిఎం.సత్యవాణి, తహశీల్దార్ రాజశేఖర్, మత్స్యశాఖ, పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో 69.4 మి.మీ వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22 : జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 69.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గోకవరం మం డలంలో 11.6 మి.మీ వర్షం కురిసింది. అత్యల్పంగా సీతానగరంలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో కోరుకొండ మండలంలో 3.0. మి.మీ, రంగంపేటలో 2.4 మి.మీ, రాజానగరంలో 4.8 మి.మీ, బిక్కవోలులో 7.6 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 1.6 మి.మీ.అనపర్తిలో 4.8 మి.మీ.తాళ్ళపూడిలో 2.4 మి.మీ, గోపాలపురంలో 1.2 మి.మీ, రాజమహేంద్రవరంలో 9.2 మి.మీ, కడియంలో 4.2 మి.మీ.కొవ్వూరులో 5.8 మి.మీ.ఉండ్రాజవరంలో 0.8 మి.మీ, నల్లజర్లలో 2.6 మి.మీ, నిడదవోలులో 2.2 మి.మీ, చాగల్లు లో 1.8 మి.మీ, పెరవలిలో 0.4 మి.మీ వర్షపాతం న మోదైంది. సగటున జిల్లాలో 3.6 శాతం వర్షం కురిసింది.

రోడ్డెక్కిన.. ఎర్రకాల్వ

నిడదవోలు, జూలై 22 : నిడదవోలు మండలం శింగవరం, తీరుగూడెం, తిమ్మరాజుపాలెం, తాళ్ళపాలెం గ్రామాల్లోన్ని పంటపొలాలు ఎర్రకాలువ ముంపులోనే ఉన్నాయి. భారీ వర్షాలకు కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం నుంచి ఎర్రకాలువ వరదను దిగువకు విడుదల చేస్తుం డడంతో నిడదవోలు మండలంలోని గ్రామాల్లో ఎర్రకాలువ వరద ఉధృతి కొనసాగుతూ ఉంది. నిడదవోలు నుంచి తీరుగూడెం వెళ్లే రహదారిపై ఎర్రకాలువ వరదనీరు పొంగి పొర్లుతుంది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు సిద్ధంకండి

టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22 : గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు అధికార యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా అధికారులు , ప్రత్యేక అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టర్ సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి ఘాట్ల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని హెచ్చరించారు. వ్యవసాయ, మౌలిక సదుపాయాల నష్టాల అంచనాలు సమర్పించాలన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం డివిజన్లలో ముంపు గ్రామాలను గుర్తించి తరలింపు చర్యలకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, మెడికల్ క్యాంప్, 24/7 శానిటేషన్ ఉండాలన్నారు. ప్రభావిత ప్రాంతాలకి మిగిలిన పంచాయతీ కార్యదర్శులు, శానిటేషన్ సిబ్బందని డిప్యుటేషన్ చేయాలన్నారు. పంచాయతీల అధికారులు ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసి సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

కాలువలో బాలుడి గల్లంతు
మిర్తిపాడులో ఘటన 8

అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా

నేడు చల్లా శంకర్రావు ఎన్నిక

రాజమహేంద్రవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఆర్యాపురం అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ పాలకవర్గం ఛైర్మన్ ఎన్నిక మంగళవారం నాటికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం సోమవారమే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరగవలసి ఉంది. కానీ ముహూర్తం కుదరకపోవడంతో ఎన్నికను వాయిదా వేసినట్టు సమాచారం. ఛైర్మన్‌గా కూటమి అభ్యర్థి చల్లా శంకరరావు ఎన్నిక కానున్నారు. వైస్ ఛైర్మన్‌గా పోలాకి పరమేశ్వరరావు పేరు వినిపిస్తోంది. ఇదిలా ఉండగా అర్బన్ బ్యాంక్ ఛైర్మన్‌గా విజయం సాధించిన చల్లా శంకర్రావును సోమవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు,పిన్నింటి రవిశంకర్, తురకల నిర్మల, మీసాల నాగమణి తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.269 కోట్లు

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 22 : రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రూ.269 కోట్లు కేటాయించిట్టు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు.ఢిల్లీలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన పురందేశ్వరి రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి, ఇతర రైల్వే సమస్యలపై చర్చించారు. రైల్వే సమస్యల పరిష్కారం, రైల్వేస్టేషన్ అభివృద్ధిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని పురందేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.

ఎకరాకు రూ.6 వేల పరిహారం : దుర్గేష్

పెరవలి, జూలై 22 : నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కానూరు లో సోమవారం ముంపు చేలను పరిశీలించి నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేలవరకు నష్టపోయామని పేర్కొన్నారు.నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.6 వేలు చొప్పున పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఆయన వెంట నాయకులు అతికాల శ్రీను,పిప్పర రవి, వా కలపూడి వీర్రాజు, చిట్టూరి వెంకట నారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, నందిప శ్రీనివాస చక్రవర్తి పాల్గొన్నారు.



గుండేపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రతి రైతును ఆదుకుంటాం : కలెక్టర్

నల్లజర్ల, జూలై 22 : నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. నల్లజర్ల మండలం గుండేపల్లిలో సోమవారం పునరావాస కేంద్రాన్ని పరిశీలిం చి రైతులతో మాట్లాడారు. గ్రామంలో 20 ఎకరాల వరి పంట వరద నీటికి కొట్టుకుపోయిందని రైతులు తెలిపారు.ఎర్ర కాల్వ వరద ఉధృతి వల్ల దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించామని,ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎర్ర కాల్వ ఉధృతి తగ్గడంతో మంగళవారం పునరావాస కేంద్రాల నుంచి ప్రజలను వారి ఇళ్లకు పంపించి వేస్తామన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఎస్పీ కిశోర్, సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ

అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

కొవ్వూరు, జూలై 22 : గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున ఎవరూ నది లోపలికి వెళ్లరాదని జిల్లా ఎస్పీ డి.ఎస్.కిశోర్ అన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రాన్ని సోమవారం సందర్శించి వరద పరిస్థితిని పరిశీలించి మాట్లాడారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.లంకల్లో ఉన్న పశువులను బయటకు తీసుకురావాలని సూచించారు. గోదావరి తగ్గే వరకు నదీ తీరప్రాంతాల్లో ప్రజలు పోలీసు, రెవెన్యూ అధికారుల సూచనలు పాటించాలన్నారు.ఎక్కడైనా గండి కొడితే తక్షణం పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ, సీఐ వి.జగదీశ్వరరావు గత గోదా వరి వరద పరిస్థితులను వివరించారు.



కాలువ కాదు.. రోడ్డే : నిడదవోలు మండలం తీరుగూడెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న ఎర్రకాల్వ వరద నీరు



నిర్మలమ్మా.. నిధులివ్వమ్మా!

ఈ పద్దులోనైనా పైసలిస్తారా..



- నేడే కేంద్ర వార్షిక బడ్జెట్
- మూడో సారి నిర్మలమ్మ పద్దు
- వెక్కిరిస్తున్న విభజన హామీలు
- రూ.300 కోట్ల పెట్టుబడుల మాటేంటి
- ఐఐపీ, ఐఐఎఫ్‌టీకి అప్పట్లో ప్రకటన
- ఇప్పటికీ పట్టాలెక్కని ఇన్‌స్టిట్యూట్స్
- సెజ్‌లో ఖాళీగా మారిన భూమి
- తాత్కాలిక భవనంలోనే ఐఐఎఫ్‌టీ
- పదేళ్లలో కేటాయింపు రూ.20కోట్లే
- కలగా పెట్రోకెమికల్ కాంప్లెక్స్
- కేంద్రంలో కీలకంగా కూటమి
- దయతలిస్తే మారనున్న దశ దిశ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఒకటి కాదు రెండు కాదు.. పదేళ్ల నుంచీ నిరీక్షణ.. విభజన హామీలు అమలుకు నోచుకుంటాయని.. జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని.. కానీ ఎప్పటికప్పుడు అదే రిక్తహస్తం.. వినిపించుకోని వినతులు.. పట్టాలెక్కని ప్రాజెక్టులు.. కంటి తుడుపుగానైనా కానీ కూడా ఇవ్వని బడ్జెట్ పద్దులతో ప్రతిసారీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నష్టపోతూనే ఉంది.. అయినా పదేళ్ల నుంచీ ఎదురుచూపులు చూస్తూనే ఉంది. అయితే మూడోసారి వరుసగా గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వెన్నెముకగా మారిన నేపథ్యంలో ఈ పద్దులోనైనా జిల్లాకు మేలు జరుగుతుందా అనే ఆశలు అందరిలో నెలకొన్నాయి. విభజన సమయంలో ఇచ్చిన హామీలకు ఈసారైనా న్యాయం జరుగుతుందా అని అంతా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా 2014 లో అప్పట్లో విభజన హామీల కింద కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లు రూ.300 కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. రూ.32వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. అయితే ఇప్పటికీ అవి వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఒక్క ఫారన్ ట్రేడ్ క్యాంపస్ మాత్రం ఏదో మొక్కుబడిగా జేఎన్టీయూకేలో తాత్కాలిక భవనంలో నడుస్తోంది. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో అయినా నిధులిల్చి మోక్షం కల్పించాల్సిన అవసరం ఉంది.

భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ వచ్చేనా?

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం కాకినాడలో రూ.32 వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. అందులో భాగంగా 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటుచేయడానికి గెయిల్-హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడిచమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలు ఎక్కించడానికి గత టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపింది. చమురు కంపెనీల ఇంజనీర్లు వచ్చి సెజ్ భూమి నాణ్యత పరీక్షించి పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువుగా ఉందని తేల్చారు. తర్వాత పనులు ప్రారంభించేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ఒత్తిడి తెచ్చారు. పైగా అప్పట్లో రాష్ట్రంలో కేంద్రానికి భాగస్వామ్యం ఉండడంతో అనుమతి పనులు చకచకా ముందుకు కదిలాయి. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధి పొందనున్నందున రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రానికి విన్నవించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కొంత మెత్తబడినట్టే కనిపించింది. కానీ ఈలోపు రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో విషయం మళ్లీ మొదటికొచ్చింది. తర్వాత పెట్రో కాంప్లెక్స్ విషయమై జగన్ సర్కారు కేంద్రాన్ని నిలదీయలేక ఐదేళ్లు పట్టించుకోలేదు. తాజాగా రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటి ఫైళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు దుమ్ము దులిపించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు కదిలేలా పావులు కదపడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కేంద్రం బడ్జెట్ పద్దులో దీనికి సంబంధించి కీలక ప్రకటన చేస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దశ, దిశ మారనుంది. పైగా ప్రస్తుతం కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కీల కమైన నేపథ్యంలో నిర్మలమ్మ పద్దులో దీన్ని పట్టించుకుని పట్టాలెక్కిస్తారా? లేదా? అన్నది చూడాలి. అటు వేతన జీవు లు సైతం ఈ బడ్జెట్‌లో మేలు చేసే నిర్ణయాలు ఉంటాయేమోనని ఎదురుచూస్తున్నారు. ఆదాయపు పన్ను పరిమితిని పెంచితే పెరిగిన ధరాభారాన్ని ఎంతో కొంత తట్టుకునేందుకు వీలుంటుందని చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో హెచ్ఆర్ఏ మినహాయింపు సైతం పెంచుతారనే చర్చ జరుగుతోంది.

మాటలే..మూటల్లేవు..

ఏటా కేంద్రం ప్రవేశపెడుతున్న వార్షిక బడ్జెట్‌లో జిల్లాలో కీలక ప్రాజెక్టులకు నిధులు విడుదలవుతాయనకుంటే ప్రతిసారీ రిక్తహస్తమే.విభజన సమయంలో జిల్లాకు ప్రకటించిన ఏ ప్రాజెక్టును కేంద్రం పట్టించుకోవడం లేదు. అసలు వాటి ఉనికినే పక్కనపడేసింది. ప్రధానంగా రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు ఒక్కో కీలక ప్రాజెక్టు ప్రకటించింది. అందులో భాగంగా కాకినాడలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారన్‌ట్రేడ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఒక్కో దానికి రూ.150 కోట్లు ఇస్తామని మాట ఇచ్చింది. తద్వారా ఈ రెండు క్యాంపస్‌ల రాకతో అటు యువతకు ఉద్యోగావకాశాలు,పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అంతా భావించారు. దీనికి తగ్గట్లే 2014 తర్వాత ఈ రెండింటికీ అప్పటి బడ్జెట్‌లో కేంద్రం చెరో రూ.10 కోట్లు కేటాయించింది. ఈ రెండు క్యాంపస్‌లు చాలా వేగంగా అందుబాటులోకి వస్తాయని అంతా భావించారు. ఎలాగూ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగడంతో అప్పట్లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో ఈ రెండు విద్యాసంస్థల ఏర్పాటుకు 50 ఎకరాలు సిద్ధం చేశారు. ఆ తర్వాత కేంద్రం వీటి ఊసే మర్చిపోయింది. పదేళ్లగా కేంద్రం బడ్జెట్‌లో చిల్లిగవ్వ కూడా విదల్చడం మానేసింది. గతేడాది అతికష్టంపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ క్యాంపస్‌ను తాత్కాలికంగా కాకినాడ జేఎన్టీయూలో ఏర్పాటుచేశారు. ఈ బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయిస్తే సమస్యలు తీరే అవకాశం ఉంది. కొత్త క్యాంపస్‌లకు శాశ్వత భవనాలు సమకూరేలా కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉంది. గతేడాది కాకినాడకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జేఎన్టీయూలో తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభించడం విశేషం.ఈ నేపథ్యంలో వీటికి నిధులు కేటాయించాలని అంతా కోరుతున్నారు.

కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్ పడేనా!

ఎన్‌డీఏ ప్రభుత్వం ఆశలెన్నో

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై ఆశలు చిగురిస్తున్నాయి. రాజమహేంద్రవరం ప్రధాన స్టేషన్ అభివృద్ధి చేయడానికి కేంద్రం నిధులు ఇవ్వనున్నట్టు సమాచారం. పార్లమెంట్‌లో మంగళవారం రైల్వే బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఉండడం వల్ల ఈసారి బడ్జెట్‌లో రాష్ట్రంతో పాటు జిల్లాకు మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌తో సోమవారం రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఢిల్లీలో భేటీ అయ్యారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌తో పాటు జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద రూ.269 కోట్లు కేటాయించడానికి మంత్రి సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. బడ్జెట్‌లో అధికారికంగా వీటిని ప్రకటించవచ్చు. చాలా కాలంగా పెండింగ్‌లో కొవ్వూరు -భద్రాచలం రైల్వే లైన్ చర్చకు రానుంది. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి 2011లో నాటి ఏపీ ప్రభుత్వం 923.23 కోట్ల ప్రతిపాదించింది. ఫిఫ్టీ ఫిఫ్టీ కేటాయించేలా నిర్ణయించారు. ఈ మేరకు డీపీఆర్ తయారుచేయడానికి రూ.5 కోట్లు కేటాయించారు. కానీ తరువాత పట్టాలెక్కలేదు. జిల్లా మీదగా థర్డ్‌లైన్ నిర్మించడం, నిడదవోలు రైల్వే జంక్షన్ అభివృద్ధి వంటి అంశాలపై ఎటువంటి నిర్ణయం వెలుడుతుందోననే ఆసక్తి నెలకొంది. గతంలో థర్డ్‌లైన్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచి కాంట్రాక్టు ఒకే అయిన తర్వాత నిలిపి వేశారు. మళ్లీ దాని ఊసెత్తలేదు. మరో పక్క గోదావరిపై మరో రైల్వే వంతెన అవసరమనే వాదన మొదలైంది. నేటి బడ్జెట్‌లో ఏ మేరకు నిర్ణయం తీసుకుంటారోననే దానిపై ఆసక్తి నెలకొంది.

రైతులను ఆదుకోండి: మద్దిపాటి



ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జూలై 22: ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మంత్రులను కలిసి సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం పంట పొలాలు నీట మునిగాయని.. పరిహారం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి కోరారు. కొవ్వాడ కాల్వ ముంపు సమస్యకు పరిష్కారం చూపా లని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసినట్టు చెప్పారు. సమావేశం అనంతరం ఆయన చరవాణిలో మాట్లాడుతూ సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు తాను హాజరైనట్టు చెప్పారు. మొదటి రోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం అనంతరం సమావేశం మంగళవారానికి వాయిదా వేశారని అన్నారు. అనంతరం ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు అనుసరించాల్సిన తీరుతెన్నులపై దిశానిర్దేశం చేశారన్నారు. అలాగే వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడినప్పటికీ సమయమనం పాటించాలని సూచించారన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసి వారి మన్ననలు పొందాలన్నారు. ఉచిత ఇసుక పాలసీలో ఎవ్వరూ జోక్యం చేసుకోవద్దని ప్రభుత్వం ప్రకటించిన ఇసుక పాలసీ సక్రమంగా కొనసాగేలా చూడాలని తెలిపారని మద్దిపాటి అన్నారు.

పంగిడి విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

కొవ్వూరు, జూలై 22: మండలంలోని ఐ.పంగిడి జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి బానాల జ్ఞానేశ్వర్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్టు హెచ్‌ఎం మంగిన శ్రీరామారావు తెలిపారు. జ్ఞానేశ్వర్ 10వ తరగతిలో 600 మార్కులకు 576 మార్కులు సాధించాడన్నారు. సోమవారం పాఠశాలలో జ్ఞానేశ్వర్‌ను ఆయనతోపాటు విద్యాకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

వేములూరులో నీటి నాణ్యత పరీక్షలు



వేములూరులో తాగునీటి నాణ్యత పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుశీల

కొవ్వూరు, జూలై 22: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని ఎంపీడీవో కె.సుశీల అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వేములూరు, నందమూరు గ్రామాల్లో తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లోని అన్ని బోర్లు తనిఖీ చేసి, నీటి నాణ్యతను పరీక్షించారు. ప్రజలకు వర్షాకాలంలోను, డయేరియాను అరికట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఊబా నందిరాజు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీలు పాల్గొన్నారు.

రోటరీ మిడ్‌టౌన్ అధ్యక్షుడిగా చైతన్యబాబు



నిడదవోలు, జూలై 22: నిడదవోలులో రోటరీ క్లబ్ మిడ్‌టౌన్‌కు 2024-25 సంవత్సరానికి అధ్యక్షుడిగా రాచర్ల చైతన్యబాబును ఎంపిక చేసినట్టు ప్రస్తుత అధ్యక్షులు గుంపుల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 26న బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో జరిగే కార్యక్రమంలో చైతన్యబాబు ప్రమాణం చేస్తారన్నారు.

నల్లజర్ల పీహెచ్‌సీకి ఫ్యాన్లు వితరణ

నల్లజర్ల, జూలై 22: నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన సితార ట్రావెల్స్ అధినేత అలపాటి లక్ష్మీనారాయణ రూ.13 వేలు విలువైన ఆరు సీలింగ్ ఫ్యానులను అందించినట్టు డాక్టర్ తెల్లం గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను ఉద్యోగుల సంఘం కన్వీనర్ జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది అభినందించారు.

జనసైనికుడి కుటుంబానికి బీమా చెక్కు



సురేష్ కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న సువర్ణరాజు

దేవర పల్లి, జూలై 22: జనసైనికులు, వీరమహిళల సంక్షేమమే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ధ్యేయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. దేవరపల్లికి చెందిన జనసైనికుడు కోట సురేష్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. సురేష్ క్రియాశీలక సభ్యుడు కావడంతో అతని భార్య పుసపకు రూ.5 లక్షల బీమా చెక్కును సువర్ణరాజు, జనసేన నాయకులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురేష్ మృతి విషయం తెలుసుకున్న వెంటనే రూ.20 వేలు దహనఖర్చుల నిమిత్తం అందజేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కాట్నం గణేష్, కంబాల సత్తిబాబు, చప్పిటి శివనాగప్రసాద్, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, అడబాల మణికంఠ, సూరిశెట్టి బాలు, జాజిమొగ్గల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెంకుటిల్లు కూలి మహిళకు గాయాలు



గోపవరంలో కూలిన పెంకుటిల్లు

గోపాలపురం, జూలై 22: మండలంలోని గోపవరం గ్రామంలో పెంకుటిల్లు కూలి ఓ మహిళకు గాయాలయ్యాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామానికి చెందిన మేకాని సుబ్బలక్ష్మి, దొరయ్యలకు చెందిన పెంకుటిల్లు ఆదివారం అర్ధరాత్రి నిద్రిస్తుండగా కూలి వారిపై పడింది. దీంతో సుబ్బలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు సహాయంతో గ్రామస్థులు రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రికి తరలించారు. సమాచారాన్ని తహశీల్దార్ వనజాక్షి దృష్టికి తీసుకెళ్లినట్టు సర్పంచ్ తెలిపారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



గోవకరం/ కోరుకొండ, జూలై 22: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను రక్షించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని తంటికొండ, కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలుసూచనలు చేశారు. వారంరోజులు వరి పైరు వరదనీటిలోఉన్నప్పటికీ ఎలాంటి నష్టంజరగదని వారం దాటిన తరువాత నష్టం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నారుమడి నుంచి నీటిని పూర్తిగా బయటకు పంపి 5సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ కలిపి వేసుకోవాలన్నారు. ఒక గ్రామ్ కార్బన్‌డిజిమ్ లేక మాంకోజెబ్ పిచికారీ చేసుకోవాలన్నారు. పిలకల దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని చెప్పారు. వ్యవసాయాధికారి వెంట ఏడీఏ మల్లికార్జునరావు, ఏవోలు రాజేశ్వరి, గౌరీదేవి, మునగాల, శ్రీరంగపట్నం రైతు భరోసా కేంద్రాల ఏఈవోలు, రైతులు ఉన్నారు.

‘అసత్య ప్రచారం మానుకోవాలి’

దివాన్‌చెరువు, జూలై 22: కూటమి ప్రభుత్వంపై అసత్యప్రచారాలు చేసే విధానాన్ని మానుకోవాలని టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు మాజీ సీఎం జగన్‌కు హితవు పలికారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి పట్టుమని నెలరోజులు కూడా కాకముందే జగన్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ కార్యకర్తలపై ఎంతో అభిమానం ప్రదర్శిస్తున్న జగన్ తన సొంత బాబాయ్ హత్య కేసు వేగంగా దర్యాప్తు పూర్తిచేసి నిందితులకు శిక్ష పడేవిధంగా ఐదేళ్ల పాలనలో ఎందుకు ప్రయత్నించలేదని ప్రశ్నించారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరదను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ



పెరవలి: తీపర్రు వద్ద నీట మునిగిన అరటి తోట



గోపాలపురం: భీమోలులో పాడైన పంటను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

ముంపు గ్రామంగా మద్దూరులంక

- బాధితులకు పునరావాసం కేంద్రం ఏర్పాటు
- కేంద్రాల్లో భోజనం, వసతి, హెల్త్ క్యాంపులు
- ముంపు ప్రాంత ప్రజలు సహకరించాలి
- కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ
- గోష్పాదక్షేత్రంలో వరద ఉధృతి పరిశీలన

కొవ్వూరు, జూలై 22: ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడికి ప్రజలను తరలిస్తున్నామని, వారికి అక్కడ భోజనం, తాగునీరు, వసతి, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశామని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వరద ఉధృతిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారని, వరద మరింత పెరిగే అవకాశం ఉన్నందున్న ప్రజలు సహకరించాలన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ముంపు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారన్నారు. గోష్పాదక్షేత్రంలో నదీలోకి ఎవ్వరూ దిగకుండా పోలీసు పికెటింగ్ పెట్టామన్నారు. డివిజన్ పరిధిలో ఇప్పటివరకు ఎటువంటి ప్రమాదం లేదని, అధికారుల హెచ్చరికలను పాటించాలన్నారు. కొవ్వాడకాలువ, ఎర్రకాలువలు పొంగడంతో నిడదవోలు, నల్లజర్ల మండలాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి గోదావరి వరద పెరుగుతున్నందున్న కొవ్వూరు మండలం మద్దూరులంకను ముంపు గ్రామంగా గుర్తించామని సబ్ కలెక్టర్ చెప్పారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డివిజన్‌లో పంటలు ముంపునకు గురై రైతులు నష్టపోయారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇళ్లపై సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ వి.జగదీశ్వరరావు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

లంక భూములు మునక

పెరవలి, జూలై 22: ఎగువ భాగం నుంచి వస్తున్న వరదతో మండల పరిధిలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. నిన్న, మొన్నటి వరకు ఒక మాదిరిగా ఉన్న గోదావరి సోమవారం మరింతగా పెరిగి లంక భూములను ముంచింది. దీంతో పచ్చగడ్డి బీడులతోపాటు అక్కడక్కడ అరటి తోటలు, కూరగాయలు వంటి పంటలు నీట మునిగాయి. వరద పరిస్థితి ఇదేవిధంగా ఉంటే మంగళవారం నాటికి పైలంక భూములన్నీ నీట మునిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తీపర్రు వద్ద వరదను తహశీల్దార్ డి.సుధ, ఎంపీడీవో హిమమహేశ్వరి, ప్రత్యేకాధికారితో కలిసి పరిశీలించారు. గోదావరి ప్రాంత రైతులందరూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ నదిలోకి దిగవద్దని, స్థానిక అధికారులు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పంట పొలాల్లో ఇసుక మేటలు

దేవర పల్లి, జూలై 22: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వరి పొలాలు ముంపు గురవడం, ఇసుక మేటలు వేయడం జరిగింది. దేవరపల్లిలో చిట్లు దుర్గారావు, ఓరుగంటి శివరాజు పొలాల్లో ఇసుక మేట వేసి వరిపొలాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని, ఈ పొలాల్లోని వర్షాల వల్ల నీరు వెళ్లేందుకు కాల్వలు సరిగా లేకపోవడం, భూఆక్రమణలు జరగడంతో తమ పొలాల్లోకి వరదనీరు చేరి ఇసుక మేటలు వేసిందని కౌలు రైతు చిట్లు దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. పంటపొలాలు ముంపుకు గురి కాకుండా పుంతరోడ్లు సరిచేసి నీరు సక్రమంగా వెళ్ళే విధంగా చూడాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఆచార్యులకు అందజేశారు. వర్షాలకు నష్టపోయిన వరి రైతుల పొలాలకు సీపీఎం నాయకులు కొత్తగుండి రత్నాజీ, పిన్నమనేని సత్యనారాయణ వెళ్లి పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్యంపై శ్రద్ధ తీసుకోవాలి: డీఎల్‌పీవో

తాళ్లపూడి, జూలై 22: వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీవో వై.అమ్మాజీ తెలిపారు. సోమవారం ఆమె తాళ్లపూడి పరిసర గ్రామాల్లో పర్యటించారు. దోమలు ప్రబలకుండా డ్రైన్లలో ఆయిల్ బాల్స్ వేయించే కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో చేపడుతున్నామని చెప్పారు. ముందుగా తాళ్లపూడి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇదిలా ఉండగా కొవ్వాడ కాలువ నీటితో మునిగిన అన్నదేవరపేటలోని జాన్‌పేటలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఏఈ కొండలరావు వరద నీటి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. నీటి ఉధృతి తగ్గిన ప్రాంతాల్లో సచివాలయం ఆధ్వర్యంలో బ్లీచింగ్ చల్లే కార్యక్రమం చేపట్టారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వైద్యసలహాలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆశాఅలేఖ్య, వీరన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

గోపాలపురం, జూలై 22: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటమునిగిన, దెబ్బతిన్న పంటలను ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహశీల్దార్ వనజాక్షి సోమవారం పరిశీలించారు. అలాగే చిట్యాల, చెరుకుమిల్లి, వెంకటాయపాలెంలో నీటమునిగిన పొలాలను ఎంపీడీవో కే.రమేష్ పరిశీలించారు.

గోదావరి ఉధృతిని పరిశీలించిన అధికారులు

నిడదవోలు, జూలై 22: మండలంలోని పురుషోత్తపల్లి, పందలపర్రు, పెండ్యాల గ్రామాల్లో గోదావరి వరద ఉధృతిని తహశీల్దార్ వి.నాగభూషణం, వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ పరిశీలించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరదనీరు పోటెత్తుతోంది. దీంతో నది పరివాహక ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



దేవరపల్లిలో రైతు దుర్గారావు పొలంలో వేసిన ఇసుక మేట



తాళ్లపూడిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో అమ్మాజీ

చెట్టు కొమ్మలు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొవ్వూరు, జూలై 22: అనుమతుల్లేకుండా గోష్పాదక్షేత్రంలో దేవతా వృక్షం కొమ్మలు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. గోష్పాదక్షేత్రానికి విచ్చేసిన సబ్ కలెక్టర్‌కు మున్సిపల్, ఏజీఆర్‌బీ అధికారుల తీరుపై ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ సుందరేశ్వరస్వామి ఆలయం ఎదురుగా 150 ఏళ్ల వయసున్న దేవతా వృక్షం (రావిచెట్టును) కొమ్మ విగిరిపోయిందని, దాని తొలగింపు పేరుతో చెట్టును 70శాతం నరికివేశారని, దానిపై మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారని, వారమైనా ఎటువంటి చర్యలు తీసుకోక పోగా గోష్పాదక్షేత్రం మున్సిపాలిటీ పరిధి కాదని, చెట్టు నరికింది మునిపాల్టీ వారని వాళ్లే దుంగలు తొలగించాలని ఏజీఆర్‌బీ ఏఈలు తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమ్మలు కొట్టే సమయంలో చెట్టు కింద ఉన్న సిమ్మెంటు సపట దెబ్బతిందని, బాధ్యులపై విచారణ చేపట్టకుండా మున్సిపాల్టీ రూ.3 లక్షలు వెచ్చించి సపటా నిర్మిస్తోందన్నారు. హిందూ ధార్మిక ప్రదేశంలో దొంగలను రక్షించడానికి కొందరు అధికారులు వంతులు వేసుకోవడం సరికాదన్నారు.కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, చెరుకూరి సాయిరాజు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం : మంత్రి దుర్గేష్

- ఎర్రకాలువ ముంపు ప్రాంతాల్లో పర్యటన



నిడదవోలు: తాళ్లపాలెంలోని ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం/నిడదవోలు, జూలై 22: రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం, పసలపూడి, కాల్దరి గ్రామాల్లో యర్రకాలువ ముంపు పొలాలను, నిడదవోలు మండలం తాళ్లపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం సాయంత్రం ఆయన సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని, వరద నీరు తగ్గిన తర్వాత పంటలను అధికారులు ఎన్యూమరేషన్ చేస్తారని చెప్పారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని సీఎం చంద్రబాబును కోరినట్టు చెప్పారు. యర్రకాలువ ముంపుతో ప్రతిఏటా పంటలు దెబ్బతింటున్నాయని, దీనికి పరిష్కారం దిశగా ప్రభుత్వం ఆలోచన చేసి ఒక ప్రణాళికను తయారు చేస్తున్నట్టు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లతో మాట్లాడానన్నారు. పంట నష్టపోయి ప్రతి ఎకరాకు రైతుకు ఇన్‌పుట్ సబ్సిడి రూ.6 వేల అందించే విధంగా కోరానని, దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి దుర్గేష్ తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, నిడదవోలు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఆర్‌వీ రమణనాయక్, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, టీడీపీ, జనసే మండలాధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ల బాలాజీ, తహశీల్దార్‌లు కె.నవీన్‌కుమార్, వి.నాగభూషణం, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు, నాయకులు ఈర్పిన సత్యనారాయణ, రాచమళ్ల శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

మిర్తిపాడులో బాలుడి అదృశ్యం

కాలువలో గాలింపు చర్యలు.. పక్కన సైకిల్ లభ్యం





మిర్తిపాడులో బాలుడి కోసం గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, రాంబాబు(ఫైల్)

సీతానగరం, జూలై 22: మండలంలోని మిర్తిపాడు గ్రామం వద్ద ఉన్న కాలువలో ఓ బాలుడు ప్రమాదవశాత్తూ పడి గల్లంతయినట్టు అనుమానిస్తున్నారు. అధికారులు, బత్తుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎ బృందం గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆ బాలుడు అదృశ్యమైనట్టు భావిస్తున్నారు. కొందరి కథనాల మేరకు తిరుమలా స్కూల్లో పదో తరగతి చదువుతున్న ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన పిప్పళ్ల రాంబాబు(15) హాస్టల్ ఉంటున్నాడు. మూడు రోజులు సెలవులు రావడంతో ఉండేశ్వరపురంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. ఆదివారం సాయంత్రం 6గంటలకు ఇంటి వద్ద సెల్‌ఫోన్ పట్టుకుని ఆడుకోవడంతో తండ్రి వెంకటపతి మందలించాడు. దీంతో సెల్‌ఫోన్ అక్కడ విసిరికొట్టి సైకిల్‌పై బయటకు వెళ్ళిపోయాడు. రాత్రి 9గంటలైనా తిరిగి రాకపోవడంతో పలుచోట్లు వెతికారు. అయినా కనిపించలేదు. బొబ్బిలంక వైపు వంతెన వద్దకు వెళ్లడం చూసినట్టు సెంటర్‌లో కొంతమంది చెప్పడంతో అక్కడికి వెళ్లి చూడగా బొబ్బిల్లంక-మిర్తిపాడు కాలువ వద్ద సైకిల్ కనిపించడంతో కాలువలో పడిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. కాగా రాంబాబు తండ్రి వెంకటపతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆడుకోవడానికి వెళ్ళిన తమ కుమారుడు ఎంతకు తిరిగి రాకపోవడంతో వెతకగా కాలువ వద్ద సైకిల్ కనిపించిందని పేర్కొనట్టు పోలీసులు తెలిపారు. బాలుడి ఆచూకీ కోసం తహశీల్దార్ నెల్సన్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ, ఎంపీడీవో కృష్ణప్రసాద్ బొబ్బిల్లంక వద్ద ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు బాలుడి జాడ తెలియరాలేదు.

జగన్ టీమ్ ఆందోళన సిగ్గుచేటు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 22: సేవ్ డెమోక్రసీ అంటూ మాజీ సీఎం జగన్, ఆయన అనుచరగణం ఆందోళన చేయడం సిగ్గుచేటని టీడీపీ ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ధారా ఏసురత్నం అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాటు సీఎంగా ఉన్న జగన్ ప్రజాస్వామ్యాన్ని ఇష్టాను సారంగా ఖూనీ చేశారన్నారు. రాష్ట్రంలో నిజమైన ప్రజాస్వామ్యం ఇప్పుడే పరిఢవిల్లుతుందన్నారు.

మిస్సింగ్ కేసులపై అలసత్వం వద్దు : ఎస్పీ

నల్లజర్ల, జూలై 22: జిల్లాలో మహిళలు, చిన్నారుల మిస్సింగ్ కేసుల విషయంలో ఆలసత్వం వహించవద్దని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. సోమవారం నల్లజర్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ సమష్టి కృషి, సమన్వయంలో జిల్లాలో మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణాను నియంత్రించాలని, ప్రజాశాంతికి భంగం కలుగకుండా శాంతి భద్రతల విషయంలో తీసుకోవాలసిన జాగ్రత్తలు, కొత్త చట్టాలను వివరించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలను, పురోగతిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో సీసీ కెమెరాలను పరిశీలించి వాటి పనితీరుపై ఆరా తీశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నది పరివాహక ప్రాంతాలను పరిశీలించి ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా తాళ్లు, బారికేడింగ్, హెచ్చరిక ఫ్లెక్సీలు పెట్టించి పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అనంతపల్లి వద్ద ఎర్ర కాల్వ ప్రవాహాన్ని పరిశీలించారు.

సుందరేశ్వరస్వామి ఆలయంలో ఎస్పీ పూజలు

కొవ్వూరు, జూలై 22: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో జిల్లా ఎస్పీ డీఎన్ కిషోర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరద ఉధృతిని పరిశీలించడానికి వచ్చిన ఆయన సుందరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు సత్కరించి, ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట సీఐలు వి.జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సిబ్బంది రామకృష్ణ తదితరులున్నారు.



నల్లజర్ల: అనంతపల్లిలో ఎర్ర కాల్వ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిషోర్



బ్యారేజ్ దిగువున సముద్రంలోకి ప్రవహిస్తున్న వరదనీరు

గోదావరి ఉగ్రరూపం

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాదహెచ్చరిక జారీ
- రెండో ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటి మట్టం

ధవళేశ్వరం, జూలై 22: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో అంతకంతకు పెరుగుతున్న గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. ఆదివారం ఉదయం 7గంటలకు ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 11.77 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10లక్షల క్యూసెక్కులు పైబడి వరద నీరు దిగువకు ప్రవహించింది. సరాసరి గంటకు 15వేల క్యూసెక్కులు చొప్పున ప్రవాహం పెరగ్గా నీటి మట్టం 2పాయింట్లు చొప్పన పెరుగుతోంది. రాత్రి 12గంటలకు నీటి మట్టం 13.60 అడుగులుగా నమోదు కాగా 12.68లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. అర్ధరాత్రికి నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక(13.75 అడుగులు)కు చేరవచ్చని అధికారుల అంచనా. కాగా ఎగువన భద్రాచలం వద్ద నీటి మట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి రాత్రి 7గంటల సమయంలో 49.40అడుగులకు చేరుకుంది. సాయంత్రం 5గంటల నుంచి పెరుగుదల కొంత నెమ్మదించినా తాలిపేరు నుంచి వచ్చిన వరద నీటితో మరలా వేగంగా పెరుగుతోంది. దిగువన శబరి నుంచి వస్తున్న వరద నీరు నెమ్మదించడంతో కుంట వద్ద నీటి మట్టం తగ్గుముఖం పట్టింది.

పూర్తిగా నీట మునిగిన ఇసుక నావ

ధవళేశ్వరం, జూలై 22: వరద ఉధృతికి గాయిత్రి ఇసుక ర్యాంప్ నుంచి కొట్టుకు వచ్చిన నావ కాటన్‌బ్యారేజ్ 1వ గేటు వద్ద మునిగిపోగా నావను గేటు వద్ద నుంచి బయటకు తీయడానికి ఆదివారం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చీకటి పడడంతో పనులు నిలిపివేశారు. సోమవారం గోదావరి వరద ఉధృతి పెరగడంతో నావ పూర్తిగా నీట మునిగింది. నీటి మట్టం తగ్గిన తర్వాత నావను బయటకు తీసే పనులు చేపట్టనున్నారు.

ఎగువ నీటి మట్టాలు ఇవే..

ఎగువన కాళేశ్వరం వద్ద నీటి మట్టం 12.390 మీటర్లు వరకు పెరిగి నిలకడగా కొనసాగుతుండగా పేరూరు వద్ద 17.260 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.470 మీటర్లు, భద్రాచలం వద్ద 49.40 అడుగులు, కూనవరం వద్ద 20.190 మీటర్లు నీటి మట్టం పెరుగుతుండగా కుంట వద్ద 13.30 మీటర్లకు పెరిగిన నీటి మట్టం తగ్గుముఖం పట్టి 12.500 మీటర్లకు చేరుకుంది. పోలవరం వద్ద నీటి మట్టం 12.900 మీటర్లకు చేరి పెరుగుతుండగా రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 16.390 మీటర్లుగా నమోదయింది.

కెనాల్ రోడ్డు హైవేగా మార్పుకు సీఎం ప్రతిపాదన

అనపర్తి, జూలై 22: వేమగిరి-సామర్లకోట కెనాల్ రోడ్డులో ప్రయాణీకులు పడుతున్న ఇబ్బందుల నుంచి త్వరలో మోక్షం కలుగనుంది. ఎన్‌హెచ్ 16, ఎన్‌హెచ్ 216 కనెక్టింగ్ కోసం వేమగిరి సామర్లకోట కెనాల్ రోడ్డు 62 కిలో మీటర్లను నేషనల్ హైవేగా కన్వర్ట్ చేయాల్సిందిగా సీఎం చంద్రబాబు.. కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి నితిన్‌గడ్కరీకి ప్రతిపాదనలు పంపారని ఎమ్మెల్యే నల్లమిల్లి విజయవాడ నుంచి అనపర్తి మీడియాకు వెల్లడించారు. కాకినాడ పోర్టు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఏడీబీ రోడ్డుతో బాటు కెనాల్ రోడ్డు అభివృద్ధి జరిగితే ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండవని, అలాగే ద్వారపూడి, బిక్కవోలు, సామర్లకోట ఆధ్యాత్మిక కేంద్రాలుగా ప్రాధాన్యత సంతరించుకున్నందున యాత్రికులు పెరుగుతున్నారని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా హైవేగా కన్వర్టు చేయాలని కోరారన్నారు.